ప్రజాశక్తి

ఆదివారం 8 డిసెంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

8 నెలల తర్వాత తీరిగ్గా..

పోర్టుకు చేరుకున్న వివాదస్పద కంటైనర్ (ఫైల్)

- తొలుత గగ్గోలు పెట్టి నేడు ఏమీ లేదని తేల్చారు...
- సిబిఐ విచారణ భాగోతానికి నిలువుటద్దం...
- విశాఖ పోర్టుకు వచ్చిన రూ.కోట్ల విలువైన డ్రై ఈస్ట్‌పై 'మీనమేషాలు'

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'కొండను తవ్వి ఎలుకను పట్టారు... అన్నది మామూలుగా సామెత. కానీ ఇక్కడ జరిగింది చూస్తే విస్మయం కలుగక మానదు. 8నెలల తర్వాత కూడా కనీసం ఎలుకను సైతం పట్టలేదు సిబిఐ అంటూ విశాఖ, రాష్ట్రంలోనూ ప్రజల్లో చర్చ సాగుతోంది. ఆ నౌకలో డ్రగ్స్ ఏమీ లేవని సిబిఐ నివేదికను ఈ నెల 6న ఇవ్వడం చూస్తే ఈ విషయం చెప్పడానికి 8 నెలలు సిబిఐ లాంటి సంస్థకు సమయం పట్టిందా? అంటూ పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు. అసలు విషయానికొస్తే బ్రెజిల్ నుంచి విశాఖకు డ్రగ్స్ సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్టర్ దిగుమతి చేసుకున్న నౌక విశాఖ పోర్టుకు 2024 మార్చి 19న వచ్చిందని ఎన్నికల ముందు టిడిపి, జనసేన, బిజెపి కూటమి గగ్గోలు పెట్టిన సంగతి తెలిసిందే. ఆపరేషన్ గరుడ పేరుతో సిబిఐ విచారణ చేపట్టింది. అప్పుడు అధికారంలో ఉన్న వైసిపి వైజాగ్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసిందంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చాక దీనిపై ఏ ఒక్క కూటమి పార్టీ నాయకులూ మాట్లాడకపోవడం విశేషం. ఈ నెల 6న సిబిఐ తన విచారణ నివేదికను బయటపెట్టింది. అందులో డ్రగ్స్ లేవని చెప్పడం అందరినీ విస్మయానికి గురిచేసింది. అప్పట్లో రూ.లక్ష కోట్ల డ్రగ్స్ ఉన్నాయంటూ ఇప్పుడు అధికారంలో ఉన్న పార్టీ పెద్దలు ఆరోపించడం తెలిసిందే. రాష్ట్ర ప్రజల్లో ఎన్నికల ముందు ఈ అంశం ఎంతగానో ప్రభావితం చేసిందన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. వాస్తవానికి అప్పట్లో 49 శాంపిల్స్ తీస్తే డ్రగ్స్ నమూనా ఉందని సిబిఐ అధికారులు ప్రాథమికంగా చెప్పి 8 నెలల తర్వాత మాటమార్చేశారన్న విమర్శలు కేంద్ర సంస్థ తీరుపై వినిపిస్తున్నాయి.

ఆ సంస్థ ఎవరిది? ఏం చర్యలు తీసుకున్నారు?

ఇనాక్టివ్ డ్రై ఈస్ట్‌ను సంధ్యా ఆక్వా మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ లిమిటెడ్ విశాఖ పోర్టుకు షిప్‌లో బ్రెజిల్ నుంచి దిగుమతి చేసుకుందన్నది వాస్తవం. దీంట్లో నార్కోటిక్స్ ఉన్నాయంటూ జరిగిన ప్రచారంపై విచారణ చేపట్టడం జరిగిందా? అప్పట్లో బిజెపికి చెందిన వారిపైనా ఆరోపణలు వినిపించాయి. కేంద్రంలో టిడిపికి బిజెపి అండ ఉండడంతో తమపైకి ఈ నౌక ఘటనను నెడుతున్నారంటూ వైసిపి రాష్ట్ర, విశాఖ నేతలు ప్రత్యారోపణలూ చేశారు. సిబిఐ నివేదిక తర్వాత ప్రజలకు ఏం అర్థమైంది.? ఎన్నికల సమయంలో కాబట్టే ఈ నౌక రాక పెద్ద ఎత్తున ప్రాచుర్యం పొందిందన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 40 అడుగుల గల ఈ నౌకలో 25 కిలోల చొప్పున డ్రై ఈస్ట్ అంటే రొయ్యల ఆహారంలో వినియోగించే పదార్థాలు 25 కిలోలకు పైగా ఉన్నాయన్నది తొలుత తేల్చారు. చర్యల దిశగా ఎన్నికలనంతరం సిబిఐ గానీ ప్రభుత్వాలు గానీ చొరవ చేయలేదు. తీరిగ్గా ఇప్పుడు నివేదిక ఇచ్చేసి తమ పని అయిపోయిందని పించుకోవడం విశేషం.

ఆంధ్రా యూనివర్శిటీ అల్యుమిని మీట్ సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

ఘనంగా ఎయు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- డిజిటల్ రంగంలో మార్పులు అవకాశాలకు నాంది : ఎల్ అండ్ టి చైర్మన్ సుబ్రహ్మణ్యం
- ఎయు పూర్వ వైభవానికి కృషి : లోకేష్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల వార్షిక సమ్మేళనం వేవ్స్- 2024 శనివారం సాయంత్రం బీచ్ రోడ్‌లోని కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్ అండ్ టి చైర్మన్ ఎస్ఎన్.సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ రంగంలో వస్తున్న మార్పులు నూతన అవకాశాలకు నాందిగా నిలుస్తాయని చెప్పారు. ఎయు ఎఐ ల్యాబ్‌ను సందర్శించిన సమయంలో అక్కడ యువత ఎంతో ఆసక్తికరంగా తమ ఆవిష్కరణ వివరించారని చెప్పారు. నిర్మాణ రంగంలోకి యువత రావడానికి ఆసక్తి చూపడం లేదని, దీంతో ప్రతిభను కోల్పోవాల్సిన పరిస్థితి ఎదురవుతోందని చెప్పారు. నిర్మాణ రంగంలో కార్మికుల కొరత కూడా భారత్‌లో అధికంగా ఉందని చెప్పారు.

రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో ఆంధ్రా యూనివర్శిటీ గత వైభవాన్ని తిరిగి పొందడమే కాకుండా భారతదేశంలో టాప్ -3, ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్ 100లో ఒకటిగా నిలిపేందుకు తాము కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రముఖ గణిత శాస్త్రవేత్త సిఆర్ రావు, యుజిసి మాజీ వైస్ చైర్మన్ బిఆర్.రావు, భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, జిఎంఆర్ గ్రూపు

మిగతా 2లో..

ఉత్సాహంగా ఆర్‌టిసి క్రీడాపోటీలు

వార్త 3లో..

హెచ్ఎస్ఎల్ డైరెక్టర్‌గా కమాండర్ రాకేష్ ప్రసాద్

వార్త మెయిన్ 3లో..

ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దాలి

వార్త 2లో..

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై మోడీని కూటమి ప్రశ్నించాలి

వార్త 2లో..

వార్తలు 7లో..

నాతవరం మండలంలో విద్యార్థులకు ప్రొగ్రెస్ రిపోర్టు అందిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

విజయవంతంగా పేరెంట్- టీచర్ మీటింగ్

ప్రజాశక్తి-విశాఖపట్నం : విశాఖపట్నం జిల్లాలో 595 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పేరెంట్- టీచర్ మీటింగ్‌ను శనివారం విజయవంతంగా నిర్వహించినట్లు డిఇఒ ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని 54737 మంది విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారని పేర్కొన్నారు. పలు పాఠశాలల్లో జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచనలు సలహాలిచ్చారు. పేరెంట్ -టీచర్ మీటింగ్ లక్ష్యాలు, ఆవశ్యకతను రీజనల్ జాయింట్ డైరెక్టర్ బి.విజయభాస్కర్, డిఇఒ వివరించారు. అనకాపల్లి జిల్లాలోని పలు పాఠశాలల్లో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, హోమ్ మంత్రి అనిత పాల్గొని ప్రసంగించారు.

ఇక అమీతుమీ!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ పెట్టుబడిదారుల సదస్సుల్లో వ్యాపార వేత్తల కోసం 6వ తేదీన రోజంతా ముచ్చటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు విశాఖ ఉక్కు పరిశ్రమ కనపడలేదు. ఇది నిజంగా ఈ ప్రాంత ప్రజలు, కార్మికులను తీవ్ర నిరాశకు, ఆందోళనకు గురిచేసిందనే చెప్పాలి. దీంతో ఉక్కు కార్మికులు 'అమీతుమీ' ('ఫైట్ ఇట్ అవుట్') మోడ్‌లోకి వెళ్లాల్సిన పరిస్థితులు దాపురించాయి. ప్రభుత్వ రంగంలో విశాఖ ఉక్కును కొనసాగించాలన్న ఏకైక డిమాండ్‌తో సుమారు 1396 రోజులుగా అత్యంత శాంతియుతంగా పోరాటాన్ని చేస్తున్న కార్మికులు, విశాఖ ప్రజలపై 'కూటమి' పాలకుల మనసులు కరగలేదనే చెప్పాలి. ఉక్కు కార్మికుల ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటాన్ని, కేంద్రాన్ని నిలదీసే అంశాన్ని 'కూటమి' పార్టీల్లోని టిడిపి, జనసేన పక్కను పెట్టేశాయా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. పార్లమెంట్ సాక్షిగా ఇటీవల కేంద్ర ఉక్కు మంత్రి చేసిన ప్రకటన '2021 జనవరి 27న కేంద్ర ఆర్థిక వ్యవహారాల కమిటీ తీసుకున్న నిర్ణయం 'విశాఖ ఉక్కు

వ్యూహాత్మక అమ్మకం లేదా ప్రైవేటీకరణ' కొనసాగుతుందని వెల్లడించడంతో విశాఖ కార్మికలోకం భగ్గుమంది. ముఖ్యమంత్రి దీనిపై స్పష్టమైన ప్రకటన చేసి పోరాడుతున్న కార్మికులకు కాసింత ధైర్యాన్నిస్తారని ఊహించి భంగపడ్డారు.

ఏరు దాటక ముందు ఎన్నెన్నో హామీలు, నినాదాలు..

2024 ఎన్నికల్లో అన్ని పార్టీలు టిడిపి, జనసేన, వైసిపి ఉక్కు రక్షణకు కట్టుబడ్డామంటూ ఓట్లు దండుకునే ఎత్తు వేశాయి. సిపిఎం వామపక్షాలు, కాంగ్రెస్ మాత్రం దీనిపై నికరంగా పోరాడితేనే నిలబడుతుందని ఎన్నికల్లో పై ఏ పార్టీ గెలిచినా సాధ్యపడదని ముందే చెప్పాయి. ఇదంతా ఏరు దాటక ముందు నినాదాలు, హామీలు కాగా ప్రస్తుతం ప్రధాన పార్టీల నేతలు ఏరుదాటిపోయారు. ఎన్నికల్లో నెగ్గేశారు. విశాఖపట్నం పార్లమెంట్, గాజువాక అసెంబ్లీ నుంచి ప్రజలు భారీ మెజారిటీని తెలుగుదేశం పార్టీకి ఇచ్చారు. ఇంతా జరిగాక తమ చేతుల్లో లేని విషయమని, ఢిల్లీ స్థాయిలో మా ముఖ్యమంత్రి చంద్రబాబు చూడాల్సిన వ్యవహారమంటూ ఎమ్మెల్యే, ఎంపీ దాదాపు చేతులెత్తేశారు. 5ఏళ్ల

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఘనంగా ఎయు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సంస్థల అధినేత గ్రంధి మల్లిఖార్జునరావు, నీలి బెండపూడి, బివిఆర్ మోహన్ రెడ్డి, రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్, బ్యాంక్ ఆఫ్ అమెరికా వైస్ చైర్మన్ పూర్ణ సగ్గుర్తి వంటి ప్రముఖులు సాధించిన విజయాలు ఆంధ్ర విశ్వవిద్యాలయ వారసత్వానికి నిదర్శనం అన్నారు. అల్యూమిని ప్రముఖుల వృత్తిపరమైన, వ్యక్తిగత అనుభవాలు, మార్గదర్శకత్వం, ప్రగతిశీల ఆలోచనలు ప్రస్తుత విద్యార్థులు, యువత కెరీర్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపయోగపడతాయని తెలిపారు. అధునాతన ఆవిష్కరణలు, పరిశోధనల కేంద్రంగా ఆంధ్రా యూనివర్సిటీని ముందువరుసలో నిలిపేందుకు అల్యూమిని ప్రముఖులంతా ధృడమైన సంకల్పంతో ముందుకురావాలని కోరారు. అనంతరం ఆంధ్రా యూనివర్శిటీ అల్యుమిని మీట్ సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రయంలో ఎయు పూర్వ విద్యార్థుల సంఘం వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ జిఎం.రావు, ప్రత్యేక అతిథి పద్మశ్రీ డాక్టర్ ఎస్‌వి.ఆదినారాయణరావు, విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్, ఎయు వీసీ ఆచార్య జి శశిభూషణరావు, ఎమ్మెల్సీ చిరంజీవి రావు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణ బాబు, పంచకర్ల రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఏయు సంగీత, నృత్య విభాగం ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన శాస్త్రీయ, జానపద నృత్యాలు ఆహూతులను అలరించాయి. పలువురు విదేశీ విద్యార్థులు తమ సంస్కృతులను తెలియజేస్తూ చేసిన నృత్యాలు, యోగా విద్యార్థులు చేసిన రూపకం ఆకట్టుకున్నాయి.

ఇక అమీతుమీ!

చేసేదేముంది?

వ్యూహాత్మకం అంటే ఇలా ఉంటుందా?

2021 నుంచీ ఏనాడూ కార్మికులు ఉత్పత్తిని ఆపలేదు. శ్రమిస్తూనే ఉన్నారు. కానీ గడచిన 6 నెలలకు పైగా కొంతమందికి అరకొరా జీతాలిస్తూ ఇంకొంతమందికి పూర్తిగా ఎండగట్టేసే పరిస్థితులు కొనసాగుతున్నాయి. 2024 నవంబర్ నెలలో 3లక్షల టన్నుల స్టీల్ ఉత్పత్తి టార్గెట్ యాజమాన్యం ఇవ్వగా కార్మికులు సంపూర్ణంగా ఉత్పత్తి చేసి చూపించారు. డిసెంబరులో 4.30 లక్షల టన్నుల లక్ష్యం ఉంది. కార్మికవర్గం చెబుతున్న ప్రకారం 4.50లక్షల టన్నులు చేసి చూపిస్తామంటూ ప్రకటించారు. కానీ రెండు నెలలుగా కార్మికులు, ఉద్యోగులు, కొన్ని విభాగాల్లో అధికారులకు సైతం జీతాలు యాజమాన్యం ఇవ్వకుండా మొండికేస్తోంది. ఐరన్ ఓర్ లేకుండా చేసి, కాంట్రాక్టు కార్మికులను ఇంటికి పంపించే కుట్రలు, బ్లాస్ట్ ఫర్నేస్‌లు మూసెయ్యడం వంటివి స్ట్రాటజికల్ సేల్‌కు ఊతమిచ్చేలా కేంద్ర నాటకాన్ని ఉక్కు యాజమాన్యం ఇక్కడ రక్తికట్టించింది. ఉక్కును దెబ్బతీసి రూ.లక్షల కోట్లవిలువైన ఉక్కు భూములను కాజేసే కుట్రలను కార్మికవర్గం చైతన్యంతో తిప్పికొడుతూ వస్తునే ఉన్నారు. నిజంగానే వ్యూహాత్మక విధానాన్ని అనుసరిస్తూ ప్లాంట్‌లో కార్మికుల మనోనిబ్బరాన్ని దెబ్బతీసే చర్యలకు యాజమాన్యం ఒడిగడుతోంది. అయినా వెరవకుండా కార్మికులు ఉత్పత్తి తగ్గకుండా నిరంతర ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. ఇక తాము అమీతుమీకి సిద్ధం కావాల్సిందే అంటూ కార్మికుల్లో తాజాగా చర్చసాగుతోంది.

10 నుంచి బిహెచ్‌పివి విశ్రాంత ఉద్యోగుల క్రికెట్ టోర్నీ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

బిహెచ్‌పివి ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, అక్కడ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నవారి కోసం ప్రత్యేకంగా మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు హార్ట్ ఫుల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రాము, రవిశంకర్ తెలిపారు. శనివారం ఒక ప్రైవేటు కార్యాలయంలో ఈ క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించిన పోస్టర్‌ను జబర్దస్త్ నటుడు, ప్రముఖ డాన్సర్ చదలవాడ రమేష్ బాబు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు,శ్రీను బాబు మాట్లాడుతూ, మూడు రోజులు పాటు మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇటువంటి క్రీడా పోటీలు వల్ల వారిలో ఐక్యత మరింత పెరుగుతుందని, ఈ పోటీలకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. భెల్ మైదానంలో ఈనెల 10 నుంచి 12వ తేదీ వరకు మ్యాచులు జరగనున్నట్లు నిర్వాహకులు వివరించారు. ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు నాని బాబు, పసుపులేటి శ్రీనివాసు, ఆనంద్, సుబేదారు, కృష్ణారెడ్డి, కృపానంద తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి-ఎంవిపీ కాలనీ : ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చెందుతున్న విశాఖను ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దాలని, 2025 జనవరి 1వ తేదీ నుంచి విశాఖ నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నిషేధానికి సహకరిస్తూ, ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగిస్తామంటూ స్వచ్ఛందంగా ప్రజలు ముందుకు రావాలని ప్రముఖ ఫిలిం సెలబ్రిటీ స్వచ్ఛ విశాఖ అంబాసిడర్ ఆర్‌పి.పట్నాయక్ ప్రజలకు పిలుపునిచ్చారు. జివిఎంసి ఆధ్వర్యాన ఆర్‌కె.బీచ్ వేదికగా మత్స్యదర్శిని సమీపంలో జివిఎంసి అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఆర్.సోమన్నారాయణ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్‌తో కలిసి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నిషేధంపై అవగాహన, ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌పి.పట్నాయక్ మాట్లాడుతూ విశాఖ ప్రకృతి ప్రసాదించిన పర్యావరణహితపరమైన పచ్చని నగరమని, ఈ నగరాన్ని ప్లాస్టిక్ రహిత విశాఖ నగరంగా తీర్చిదిద్దుకునే బాధ్యత విశాఖ ప్రజలపై ఉందని అన్నారు. రోజురోజుకు కొండగుట్టల్లా పెరిగిపోతున్న ప్లాస్టిక్ వస్తువులు ప్రజల ఆరోగ్యానికి, మూగ, జల జీవాలకు హాని కలిగిస్తూ ఈ నగరాన్ని కలుషితం చేస్తూ పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాయన్నారు. జివిఎంసి ప్లాస్టిక్ నిషేధంపై చేస్తున్న కృషికి ప్రతి ఒక్కరూ అవగాహనతో ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగిస్తామంటూ నగర ప్రజలు శపథం చేస్తూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆర్‌కె.బీచ్ సముద్ర తీర ప్రాంతంలో జివిఎంసి అధికారులు, ఉద్యోగులు, ప్రజలతో కలిసి వ్యర్థాలను వెలికి తీశారు.

జివిఎంసి అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఆర్.సోమన్నారాయణ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ మాట్లాడుతూ, కమిషనర్ ఆదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను 2025 జనవరి 1వ తేదీ నుంచి నిషేధిస్తున్నట్లు తెలిపారు. అందుకు ప్రజలు, వినియోగదారులు, వ్యాపారస్తులు, ఉత్పత్తిదారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 2, 3, 4 జోనల్ కమిషనర్లు ఎమ్‌విడి.ఫణిరామ్, కె.శివప్రసాద్, ఎమ్.మల్లయ్యనాయుడు, సహాయ వైద్యాధికారులు డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ సునీల్ కుమార్, డాక్టర్ అప్పలనాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

బీచ్‌లో వ్యర్థాలను ఏరుతున్న ఆర్‌పి.పట్నాయక్ తదితరులు

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై మోడీని కూటమి ప్రశ్నించాలి

దీక్షలో కూర్చున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయటానికి సిద్ధపడిన బిజెపి, మోడీలను ప్రశ్నించడానికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ నాయకులు ప్రయత్నించకపోవడం దుర్మార్గమని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష, కార్యదర్శులు టి.నూకరాజు, ఉరుకూటి రాజు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక ప్రజాసంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు శనివారం నాటికి 1349వ రోజుకు చేరాయి. దీక్షల్లో జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్, యుజిడి వర్కర్స్, క్లాప్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తాము ఉన్నంతవరకు స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కాదని కూటమి నాయకులు చెప్పడమే కానీ, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కాదు అని చెప్పలేకపోతున్నారని విమర్శించారు. కేంద్రం నుంచి స్పష్టమైన హామీని పొందాలని డిమాండ్ చేశారు. అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేయడం సరికాదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ జరిగితే ఎస్‌సి, ఎస్‌టి, మధ్యతరగతి వర్గాలకు ఉపాధి అవకాశాలు లేకుండా పోతాయన్నారు. రిజర్వేషన్లు ఉండవన్నారు. ఈ దీక్షలో యూనియన్ నాయకులు గొలగాని అప్పారావు, ముద్దాడ ప్రసాద్, జెఆర్.నాయుడు, ఎం.ఈశ్వరరావు, ఈ.ఆదినారాయణ (యుజిడి), క్లాప్, ఆటో డ్రైవర్స్ సురేష్, అశోక్, శ్రావణ్ కుమార్, విజయ తదితరులు పాల్గొన్నారు.

డైమండ్ పార్క్‌లో కూలిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం పరిధిలోని డైమండ్ పార్కులో శనివారం సాయంత్రం తుప్పు పట్టిన విద్యుత్ స్తంభం ఒక్కసారిగా కూలిపోయింది. పార్కులో వాకింగ్ చేస్తున్న వారు, సందర్శకులు ఈ సంఘటనతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అయితే స్తంభం కూలిన సమయంలో ఆ ప్రదేశంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. జివిఎంసి అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని, తుప్పు పట్టిన స్తంభాన్ని తొలగించకుండా ఉంచారని సందర్శకులు ఆరోపించారు.

కూలిన విద్యుత్ స్తంభం

జాతీయ క్రీడలకు ఎఎంసి విద్యార్థులు

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : డాక్టర్ ఎన్‌టిఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ తరపున సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఆంధ్రా మెడికల్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. వాలీబాల్ (పురుషుల) టోర్నమెంట్‌లో పాల్గొనడానికి ఆంధ్ర మెడికల్ కళాశాల 2021 బ్యాచ్‌కి చెందిన సి.కరుణాకర్ రాజు తిరువనంతపురంలో ఎంపికయ్యారు. అదే బ్యాచ్‌కి చెందిన యు.సూర్య తేజ, టేబుల్ టెన్నిస్ (పురుషుల) టోర్నమెంట్‌లో పాల్గొనడానికి వెల్లూరులో ఎంపికయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులు కరుణాకర్ రాజు, సూర్య తేజను ఎఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, డాక్టర్ ఆర్.సునీల్‌కుమార్, డాక్టర్ ఎ.కృష్ణవేణి అభినందించారు.

National Institute for Entrepreneurship and Small Business Development (NISBD)
(Ministry of Skill Development and Entrepreneurship, Government of India)
Pradhan Mantri Suryaghar Free Electricity Scheme, under
Ministry of New and Renewable Energy (Government of India)
Entrepreneurship-cum-Skill Development Programme on Solar Entrepreneurship
ESDP on Solar Entrepreneurship
9 Day Non Residential Program
Golden opportunity for self employment for interested youth/women
free
Registration Date : 09-12-2024 to 12-12-2024
Interview Date : 13-12-2024
Start Date : 16-12-2024
Age: Minimum 18 years to 50 years
Documents- Passport size photo, Aadhar card, Educational documents : 10TH/INTER/ITI/ANY DEGREE
Training Venue: Sri vidya institute Anakapalli
2nd Floor,Beside Usha Prime Hospital,Near RTC Complex,ANAKAPALLI-531001
CONTACT-9885765519,9502166626 ,9398417022
Contact: A-23, Sector-62, Institutional Area, Noida (UP) 201309
Log on: www.niesbud.nic.in

వాల్తేర్ డివిజన్‌లో రైళ్ల రద్దు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : రాంచీ డివిజన్‌లోని సోరంతోలి చౌక్ స్టేషన్‌లో 4 లేన్ల రైలు ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి ట్రాఫిక్ కమ్ పవర్ బ్లాక్ కారణంగా 18311 విశాఖపట్నం- బనారస్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 22వ తేదీన, 18312 బనారస్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌ను 23వ తేదీన రద్దు చేసినట్టు ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు.

జాతీయ ర్యాంకింగ్ టోర్నమెంట్‌కు అంపైర్‌గా శర్మ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : బెంగళూరులోని శ్రీ కంటీరవ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 15 నుంచి 22వ తేదీ వరకు జరగనున్న జాతీయ ర్యాంకింగ్ టోర్నమెంట్‌కు ఎల్ఐసి ఆఫ్ ఇండియా విశాఖపట్నం డివిజన్‌లో పనిచేస్తున్న డాక్టర్ డివిఎస్‌వై శర్మను బ్లూబ్యాడ్జ్ ఇంటర్నేషనల్ అంపైర్‌గా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయనను ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ శారదా ప్రసాద్‌దాస్, ఎల్ఐసి ఎంప్లాయీస్ యూనియన్ మేనేజరు ఎం.కామేశ్వరి, ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్ అభినందించారు.

IN THE HONOURABLE COURT OF THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL cum 2ND ADDITIONAL DISTRICT JUDGE: PATVATIPURAM
M.V.O.P. NO 61 /2023

Between:
Kothadi Simahachalam and 2 others ......Petitioners
And:
Bonthu Venkata Chinnayya and 2 others ......Respondents

2nd Respondent:
Ravada Naga Raju S/O Ganapathi Rao, age 40 years, plot No 302, Prahladhapuram vynatiya, Pendurthi, Visakhapatnam District. Owner of the Car baring No AP39 BF 7475

Please take notice that the above named petitioners filed the above MVOP 61/2023 against you and others for claiming compensation on account of death of the 1st Petitioner's son in a motor vehicle accident and the matter coming on for your appearance and stands posted to **19-12-2024.** On that day you personally or through your advocate attend before this Honourable court at **10.30 AM,** failing which the Honourable court will be heard and determined in your absence expert as per law.

Kota Bapooji,
Advocate Parvathipuram
ParvathipuramManyam District
Cell 9440114244

ఉత్సాహంగా ఆర్‌టిసి క్రీడా పోటీలు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాలాక్షినగర్ ఎఆర్ క్రీడా మైదానంలో జాతీయస్థాయి ఆర్‌టిసి క్రీడల పోటీలు రెండవ రోజు శనివారం కొనసాగాయి. 10 రాష్ట్రాల నుంచి వచ్చిన 456 మంది క్రీడాకారులు వివిధ క్రీడాంశాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రెండవ రోజు లాంగ్ జంప్, స్పీడ్‌వాక్, రన్నింగ్, డిస్క్ త్రో, రిలే రన్నింగ్ పోటీలు జరిగాయి. మెన్స్ లాంగ్ జంప్ పోటీల్లో ఎంఎస్‌ఆర్‌టిసి ఉద్యోగులు విజేతలుగా నిలవగా, రన్నరప్, మూడోస్థానంలో జిఎస్‌ఆర్‌టిసి, ఎంఎస్‌ఆర్‌టిసి ఉద్యోగులు నిలిచారు.

మహిళల లాంగ్‌జంప్‌లో బిఎంటిసి, కెఎస్‌ఆర్‌టిసి, ఎంఎస్‌ఆర్‌టిసి ఉద్యోగులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. మెన్స్ వెయ్యి మీటర్ల ఫాస్ట్ నడక, వెటరన్స్ పోటీల్లో ఉత్తరాఖండ్ ఆర్‌టిసి, డిటిసి, ఎపిఎస్‌ఆర్‌టిసి ఉద్యోగులు వరుసగా మూడు స్థానాలు సాధించారు. మహిళల వెయ్యి మీటర్ల ఫాస్ట్ నడక వెటరన్స్‌లో మొదటి, రెండు స్థానాల్లో ఎపిఎస్‌ఆర్‌టిసి, మూడవ స్థానంలో ఎన్‌డబ్ల్యుకెఆర్‌టిసి ఉద్యోగులు గెలుపొందారు. మెన్స్ వెయ్యి మీటర్ల ఫాస్ట్ నడకలో ఎపిఎస్‌ఆర్‌టిసి, కెకెఆర్‌టిసి, ఎన్‌డబ్ల్యుకె ఆర్‌టిసి, మెన్స్ 1500 మీటర్ల రన్నింగ్‌లో జిఎస్ ఆర్‌టిసి, కర్నాటక ఎస్‌ఆర్‌టిసి, ఎన్‌డబ్ల్యుకెఆర్‌టిసి, మెన్స్ డిస్క్ త్రోలో ఎంఎస్‌ఆర్‌టిసి, కర్నాటక ఎస్‌ఆర్‌టిసి, టిఎస్‌ఆర్‌టిసి, విమెన్స్ డిస్క్ త్రోలో ఎంఎస్‌ఆర్‌టిసి, ఎంఎస్‌ఆర్‌టిసి, ఎన్‌డబ్ల్యుకెఆర్‌టిసి, మెన్స్ 200 మీటర్ల పరుగు పోటీల్లో ఎంటిసి, ఎంఎస్‌ఆర్‌టిసి, ఎపిఎస్‌ఆర్‌టిసి, . మహిళల 200 మీటర్ల రన్నింగ్‌లో బిఇఎస్‌టి, డిటిసి, ఎన్‌డబ్ల్యుకె ఆర్‌టిసి,, మెన్స్ 400 మీటర్ల ఫాస్ట్ నడకలో కెకెఆర్‌టిసి, ఎపిఎస్‌ఆర్‌టిసి, ఎపిఎస్‌ఆర్‌టిసి, మహిళా విభాగంలో కర్నాటక ఎస్‌ఆర్‌టిసి, బిఇఎస్‌టి, ఎపిఎస్ ఆర్‌టిసి, మెన్స్ రిలే రన్నింగ్‌లో బిఎంటిసి, ఎన్‌డబ్ల్యుకె ఆర్‌టిసి, కర్నాటక ఎస్‌ఆర్‌టిసి ఉద్యోగులు వరుసగా మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

రన్నింగ్ పోటీల్లో పాల్గొన్న ఆర్‌టిసి ఉద్యోగులు

కొనసాగిన విశాఖ డెయిరీ కార్మికుల దీక్ష

దీక్షల్లో మాట్లాడుతున్న కార్మిక నేత భాస్కరరావు

ప్రజాశక్తి -గాజువాక : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విశాఖడెయిరీ వద్ద విశాఖ కోఆపరేటివ్ డెయిరీ ఎంప్లాయిస్ యూనియన్ , సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల రిలేదీక్షలు శనివారం కొనసాగాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు భాస్కరరావు మాట్లాడుతూ, తమ డిమాండ్లను నెరవేర్చేవరకు దీక్షలను విరమించేది లేదని, యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తే ఆందోళనను మరింత ఉధృతం చేసి, అవసరమైతే సమ్మెకు వెళతామని హెచ్చరించారు. డెయిరీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీక్షల్లో నాగమణిబాబు, ఆర్‌వి అప్పారావు, ఎన్.రాజేంద్రప్రసాద్, ఎల్ఎంఎం నాయుడు, జగదీష్ పాల్గొన్నారు.

బోస్ ఆర్థిక సాయంతో కెజిబివిలో వెయిటింగ్ హాల్ నిర్మాణం

శంకుస్థాపన చేస్తున్న గంటా రవితేజ

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని లొడగలవానిపాలెం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో వెయిటింగ్ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు గంట రవితేజ శనివారం శంకుస్థాపన చేశారు. మహాలక్ష్మి కల్చరల్ అసోసియేషన్ అధినేత ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ ఆర్థిక సహాయంతో దీన్ని నిర్మిస్తున్నారు.

ఈ సందర్భంగా రవితేజ మాట్లాడుతూ విద్యార్థులను కలవడానికి వచ్చే తల్లిదండ్రులు వేచియుండేందుకు సరైన వసతి లేకపోవడంతో ఇబ్బందులు పడుతుండడాన్ని గమనించిన సుభాష్‌చంద్రబోస్, వారికోసం తన సొంత నిధులతో ఎంతో ఉపయోగకరమైన వెయిటింగ్ హాల్ నిర్మించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ గంగరాజు, ఇఒపిఆర్‌డి కె రాము, తర్లువాడ సర్పంచ్ బిఆర్‌బి నాయుడు, తాత్రాజ్ అప్పారావు, వెంకటరావు, సుంకరి శివ, వైకుంఠం, బి అప్పన్న, కస్తూర్బా సిబ్బంది పాల్గొన్నారు.

జీవితాన్ని ప్రేమిస్తే ఆత్మహత్యల నివారణ

- అవగాహన సదస్సులో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి -ములగాడ : ప్రతి ఒక్కరూ జీవితం పట్ల అనురాగంతో ఉండాలని, జీవితాన్ని ప్రేమించాలని, ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలని అపుడే ఆత్మహత్యలనేవి ఉండవని పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పి.గణబాబు అన్నారు. శనివారం స్థానిక సెయింట్ ఆన్స్ హాస్పిటల్ ఆవరణలో పారిశ్రామిక ప్రాంత విలేకరుల సంఘం ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతూ, ఒత్తిడి తగ్గించుకోవాలని, క్షణికావేశం మానుకుని, కాసేపు ఆలోచిస్తే ఎవ్వరూ ఆత్మహత్యల జోలికి పోరన్నారు. యువత ఒత్తిడిని అధిగమించేందుకు వారికి కౌన్సెలింగ్ అవసరమని, దానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆత్మహత్యలు నివారణకు ప్రజల్లో అవగాహన, చైతన్యం కల్పించడం ఒక ఉద్యమంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. సమావేశానికి అధ్యక్షత వహించిన విశాఖ పారిశ్రామిక ప్రాంత విలేకరుల సంఘం అధ్యక్షులు ఎవి.గిరి మాట్లాడుతూ ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని కలిగించేందుకు, సామాజిక సేవకు విలేకరులు సిద్ధంగా ఉన్నారన్నారు. ములగాడ తహశీల్దార్ భుజంగరావు, సిఐ విద్యాసాగర్, హెచ్ఎం అరుణ కుమారి సెయింట్ ఆన్స్ హాస్పిటల్ ఎఒ సిస్టర్ బిన్సీ, న్యాయవాది గిల్బర్ట్, పాత్రికేయులు ఎస్.చలపతిరావు, ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి, నవజ్యోతి మహిళా సంఘం వెంకటలక్ష్మి, బౌద్ధ భిక్షు దమ్మానంద, వై.అనసూయా దేవి, గుప్త పాల్గొన్నారు.

వ్యాధి నిర్ధారణకు నమూనాల సేకరణ

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీ, రెడ్డివారి కల్లాలు చెందిన వెంపల రామారావుకు గొర్రెలు అంతుచిక్కని వ్యాధితో మృత్యువాత పడుతుండడంతో సమాచారం తెలుసుకున్న రెడ్డిపల్లి పశువైద్యాధికారి డాక్టర్ వెంకటేష్ శనివారం మంద వద్దకు వెళ్లి అస్వస్థతకు గురైన గొర్రెలకు వైద్యసేవలు అందించారు. ఈసందర్భంగా వ్యాధి నిర్ధారణకు గొర్రెల నుంచి నమూనాలను సేకరించారు. గొర్రెలు పూర్తిగా కోలుకునే వరకు ప్రతిరోజూ వైద్యసేవలు అందిస్తామని డాక్టర్ వెంకటేష్ ప్రకటించారు. ఈ సందర్భంగా పెంపకందారునికి కొన్ని సూచనలు చేశారు.

క్రమశిక్షణతో అభ్యసిస్తే విజయం : సిపి

విద్యార్థులతో మాట్లాడుతున్న సిపి శంకబ్రత బాగ్చీ

ప్రజాశక్తి-సీతమ్మధార : క్రమశిక్షణతో అభ్యసిస్తే, చదువులోగానీ, పోటీ పరీక్షల్లోగానీ రాణించి విజయం సాధించవచ్చని నగర పోలీస్‌కమిషనర్ శంకబ్రత బాగ్చీ సూచించారు. శనివారం పౌరగ్రంథాలయాన్ని సందర్శించారు. విద్యార్థులు, పాఠకులతో మాట్లాడారు. పోటీపరీక్షల సన్నద్ధతకు గ్రంథాలయం ఎంతో అనువుగా ఉందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో గ్రంథాలయం కార్యదర్శి వర్మ, ప్రసన్న కుమార్, సిబ్బంది పాల్గొన్నారు

'పిల్లల్ని కంటే సరిపోతుందా?'

ప్రజాశక్తి- మాధవధార: ప్రతి కుటుంబం ముగ్గురు పిల్లల్ని కనాలని ఎపి, తమిళనాడు ముఖ్యమంత్రులతోపాటు ఆర్ఎస్ఎస్ చీఫ్ దేశ ప్రజలకు పిలుపునిస్తున్నారని, అయితే ఎక్కువ మంది పిల్లలను కంటే వారిని పెంచి ప్రయోజకులను ఎలా చేయాలో చెప్పాలని కాంగ్రెస్ ఒబిసి విభాగం రాష్ట్ర ఇన్‌ఛార్జి మూల వెంకటరావు ప్రశ్నించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రజల జీవన పరిస్థితులు ఏమంత భేషుగ్గా లేవని, నిత్యావసరాల ధరాభారం, ఛార్జీలు మోత, ఇతరత్రా సమస్యలతో సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవనం దినదినగండంగా ఉందన్నారు. జనాభాలో సగంగా ఉన్న యువత చేతిలో డిగ్రీలున్నా, ఉద్యోగ, జీవనోపాధికి సరిపడా నైపుణ్యాలు లేక ఇంకా వెనుకబాటులోనే ఉన్నారన్నారు.

ఎక్కువమంది ప్రజలు పొట్టకూటికోసం ఉన్న ఊళ్లను, పిల్లలను వదిలేసి వలసపోయే దుస్థితిలో దుర్భర జీవితం గడుపుతున్నారన్నారు. మరోవైపు ప్రభుత్వపరంగా ప్రజల జీవనానికి అవసరమైన మౌలిక వసతులు కల్పన లేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లలను కనేసి రోడ్డున పడేయాలా అని ప్రశ్నించారు. ప్రస్తుతమున్న వారికి మెరుగైన జీవన పరిస్థితులు కల్పించేందుకు ప్రభుత్వ పరంగా చర్యలు చేపట్టి, ఆ తర్వాతే ఇటువంటి పిలుపునిస్తే ఆమోదయోగ్యంగా ఉండేదని వెంకటరావు అన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసుల సత్వర పరిష్కారం

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గిరిధర్

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : మధ్యవర్తిత్వాన్ని వినియోగించి, రాజీ మార్గంలో పెండింగ్ కేసులను పరిష్కరించి, సత్వర న్యాయం చేయవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా అధ్యక్షుడు ఆలపాటి గిరిధర్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదుల సంఘం గ్రంథాలయంలో మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయమూర్తి గిరిధర్ మాట్లాడుతూ, విదేశాల్లో 90శాతం కేసులు మధ్యవర్తిత్వంతోనే పరిష్కరించుకుంటున్నారని, అదే విధానాన్ని ఇక్కడ అవలంబించి సత్ఫలితాలను పొందవచ్చన్నారు. ఈసందర్భంగా పని ప్రదేశంలో మహిళల లైంగిక వేధింపుల చట్టం -2014లోని ప్రధానాంశాలను విపులంగా వివరించారు. రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించిన కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి రాధారత్నం మాట్లాడుతూ, కుటుంబ వివాదాల పరిష్కారంలో రాజీ మార్గమే ఉత్తమమైనదన్నారు. మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.వెంకటరమణ మాట్లాడుతూ, రాజీమార్గంలో కేసుల పరిష్కారంతో కోర్టులపై కేసుల భారం తగ్గుతుందన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకటశేషమ్మ మాట్లాడుతూ, మధ్యవర్తిత్వంతో పరిష్కరించగలిగే సివిల్, క్రిమినల్ కేసులను వివరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బెవరా సత్యనారాయణ, నరేష్ పాల్గొన్నారు.

నేడు తెలంగాణ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి -ఉక్కునగరం : తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉక్కునగరం స్వర్ణ జయంతి పార్కులో ఆత్మీయ సందడి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.కుమారస్వామి, జి.ఆనంద్ తెలిపారు. విశాఖ ఉక్కులో విధులు నిర్వహిస్తున్న తెలంగాణ ఉద్యోగులు కుటుంబ సభ్యులతో పాల్గొనాలని కోరారు. తెలంగాణ ఉద్యోగుల ఆత్మీయసమ్మేళనం, పిక్నిక్‌లో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే వివిధ కార్యక్రమాలను, పోటీలను నిర్వహించి, విజేతలుగా నిలిచిన వారికి అభినందనలు, ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా కార్యవర్గ సమావేశం నిర్వహించి, పిక్నిక్ విజయవంతానికి చేపట్టాల్సిన చర్యలు, ఏర్పాట్లుపై చర్చించారు. కార్యక్రమంలో బి. వెంకటేశ్వర్లు, ఎస్ .నర్సింగరావు, ఎంకెవిఆర్ మోహన్‌రావు, టి.ప్రభాకర్, జి.మల్లేశం, సిహెచ్.రవికుమార్, పరమేష్ పాల్గొన్నారు

అవంతి ఫార్మా కళాశాలకు నాక్ 'ఎ ప్లస్' గ్రేడ్

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలకు జాతీయ స్థాయిలో నాక్ ఎ ప్లస్ గ్రేడ్ లభించినట్లు కళాశాల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు శనివారం ప్రకటనలో తెలిపారు.గతనెల 27,28తేదీల్లో తమ కళాశాలను సందర్శించిన నాక్ బృందం, ఇక్కడి పరిస్థితులను పరిశీలించి, ఎ ప్లస్ గ్రేడ్ ప్రకటించిందన్నారు. కాలేజీలోని వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది సమిష్టి కృషి ఫలితమే ఫార్మసీ కళాశాలకు జాతీయ స్థాయి గుర్తింపు లభించిందని హర్షం వ్యక్తం చేస్తూ, అందరికీ అభినందనలు తెలిపారు.

సిపిఎం జిల్లా మహాసభల
జయప్రదానికి ముమ్మర ప్రచారం

కరపత్రాలను పంచుతూ ప్రచారం చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి-పెందుర్తి : ఈనెల 28,29 తేదీల్లో నిర్వహించే సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ జివిఎంసి 97వ వార్డు చిన ముసిడివాడలో శనివారం ఆ పార్టీ నేతలు ఇంటింటికి కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నేత బి.రమణి మాట్లాడుతూ పార్టీ చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. పెరిగిన ధరలు, ఛార్జీల భారంపై ప్రజలకు తెలియజెప్పి, రానున్న రోజుల్లో ఉద్యమబాట పట్టాలని, దానికి ప్రజలంతా సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రజల కోసం సిపిఎం ఎప్పుడూ పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు అప్పలనాయుడు పాల్గొన్నారు.

పిల్లల వైద్యానికి ఆర్థిక సాయం



రూ.50వేలు నగదుసాయం అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి -ఆనందపురం: అనారోగ్యంతో పుట్టిన పిల్లల వైద్యానికి గంభీరం ఒఎస్‌సి ఫౌండేషన్ ప్రతినిధులు దాతలు సహకారంతో సమకూర్చిన రూ.50వేలను శనివారం బాధిత తండ్రి అజయ్‌కు అందజేశారు.శ్రీకాకుళం జిల్లా పలాస ప్రాంతానికి చెందిన అశ్విని, అజయ్‌కుమార్ దంపతులకు ప్రీ మెచ్యూర్ కవల పిల్లలు జన్మించారు. వారి ఆరోగ్యం విషమంగా ఉండడంతో విశాఖపట్నం జగదాంబ మెడికవర్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. నవజాత శిశువుల వైద్యానికి రోజుకు రూ.40వేలు ఖర్చవ్వడంతోపాటు కనీసం 40రోజులపాటు ఆసుపత్రిలో చికిత్స కొనసాగించాలని వైద్యులు సూచించారు.

నందిగాం వద్ద చైతన్య టెక్నో స్కూల్‌లో అజయ్ ప్రైవేటు టీచర్‌గా పనిచేస్తున్నారు. కన్నవారు, అత్తింటివారు నిరుపేదలే కావడంతో బిడ్డల వైద్యానికి దాతల సాయం అర్థించగా, గంభీరం ఒఎస్‌సి ఫౌండేషన్ సభ్యులు సోషల్ మీడియా ద్వారా దాతల సహకారం అర్థించి, రూ.50వేలు సమకూర్చి శనివారం ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివ దళాయి ఆధ్వర్యంలో మెడికవర్ ఆసుపత్రికి వెళ్లి బాధిత తండ్రి అజయ్‌కు అందజేశారు. దాతలకు అజయ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

అన్నసమారాధన

అన్నసమారాధనలో వడ్డిస్తున్న తెలుగు యువత నేత మౌర్యసింహ

ప్రజాశక్తి -గోపాలపట్నం : స్థానిక ప్రశాంతనగర్‌లో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్టి వేడుకల్లో భాగంగా ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పి.గణబాబు ఆర్థికసాయంతో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనను ఎమ్మెల్యే తనయుడు మౌర్య సింహ ప్రారంభించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

పోర్టు ఆసుపత్రిని ప్రయివేటీకరిస్తే ఉద్యమం ఉధృతం

రిలేదీక్షల్లో నినదిస్తున్న పోర్టు కార్మికులు

ప్రజాశక్తి -సీతమ్మధార : పోర్టు గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రి ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని, లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని పోర్టు అఖిల పక్ష కార్మిక సంఘాల నేతలు హెచ్చరించారు. దీని వ్యతిరేకిస్తూ పోర్టు ఆసుపత్రి వద్ద చేపడుతున్న రిలేదీక్షలు శనివారం 68వ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా పోర్టు అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు.బి.జగన్ మాట్లాడుతూ వేలాదికోట్ల రిజర్వ్ ఫండ్స్, వేల ఎకరాల భూములు, అంతేకాక గతేడాది రూ.386కోట్లు, ఈ ఏడాది రూ.725కోట్ల లాభాలతో కేవలం జివిఎంసికి ఏటా సగటున రూ.65కోట్లఆస్తిపన్ను కట్టే స్థితిలో విశాఖ పోర్టుకు చెందిన ఆసుపత్రిని అభివృద్ధి కోసమని ప్రయివేటుకు కట్టబెట్టాలని చూడడం దుర్మార్గమన్నారు. విశాఖ పోర్టు చెల్లించిన ఆస్తిపన్నుతోనే జివిఎంసి పరిధిలో అనేక అభివృద్ధి పనులు జరుగుతుంటే, వేలాది మంది ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు, వారి కుటుంబసభ్యుల ఆరోగ్యాలతో ముడిపడి ఉన్న పోర్టు ఆసుపత్రికి అభివృద్ధి కోసమని పిపిపి విధానంలో ప్రయివేటుపరం చేయడం సరికాదన్నారు. కార్మికుల కృషితోనే పోర్టు ఆసుపత్రి అభివృద్ధి సాధ్యమైందని, ఇపుడు 40వేల మంది పోర్టు కుటుంబీకులకు వైద్యాన్ని దూరం చేసేచర్యలను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలన్నారు.విశాఖ పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణ యత్నాలను మానుకోవాలని, లేకుంటే కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజలను సమీకరించి పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, లక్ష్మణ్, సి.హెచ్.త్రినాధరావు, నాయుడు, సుబ్బారావు, రాజగోపాల్, ఎల్లారావు, రాఘవులు, పైడిరాజు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో తమిళనాడు దూకుడు

- మూడు రౌండ్ల తర్వాత 6మ్యాచ్ పాయింట్లతో టాప్
- ప్రత్యేక ఆకర్షణగా గ్రాండ్ మాస్టర్ వైశాలి
- ఏఐయు దక్షిణ భారత మహిళల చెస్ పోటీలు

చదరంగం పోటీల్లో పాల్గొన్న మహిళా క్రీడాకారిణులు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం విశ్వవిద్యాలయం వేదికగా భారత విశ్వవిద్యాలయాల సంఘం (ఏఐయు) నిర్వహిస్తున్న దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా చెస్ పోటీలలో రెండవరోజైన శనివారం మూడు రౌండ్ల తర్వాత తమిళనాడుక్రీడాకారులు ప్రతిభను కనబరుస్తూ దూసుకుపోతున్నారు. తమిళనాడు అన్నా యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్, కర్ణాటకలోని విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీ, ఎస్ఆర్ఎం వర్సిటీల క్రీడాకారులు ఆరు మ్యాచ్ పాయింట్లతో లీడర్ బోర్డ్‌లో మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నారు. దక్షిణ భారత్‌లోని 51వర్సిటీలకు చెందిన 300 మంది మహిళా చెస్‌క్రీడాకారులు స్విస్ లీగ్ పద్ధతిలో పోటీలలో తలపడుతున్నారు. శనివారం పోటీలలో మద్రాస్ విశ్వవిద్యాలయానికి చెందిన గ్రాండ్‌మాస్టర్ వైశాలి రమేష్‌బాబు మూడవ రౌండ్‌లో కర్ణాటకలోని మంగళూరు విశ్వవిద్యాలయం క్రీడాకారిణి శుభప్రదను కేవలం 17 ఎత్తుగడలలో ఓడించారు. మూడో రౌండ్‌లో, తమిళనాడు ఆటగాళ్లు ఆకట్టుకునే వ్యూహాత్మక చతురతను ప్రదర్శించారు. ఆతిథ్య గీతం వర్సిటీ క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శనలతో విజయసాధనకు కృషి చేస్తున్నారు. ఆదివారం జరిగే ఫైనల్స్‌తో టోర్నీ ముగియనుంది. ఛాంపియన్‌షిప్‌లో తదుపరి రౌండ్‌లకు చేరుకుని, టైటిల్ దక్కించుకునేందుకు అగ్రక్రీడాకారులున్న జట్లు దృష్టిపెట్టాయి. ఈ పోటీలలో విజేతలు జాతీయ స్థాయి మహిళల చదరంగం పోటీలకు అర్హత సాధించనున్న నేపథ్యంలో వ్యూహం, దూరదృష్టి, కచ్చితత్వంలో నైపుణ్యాన్ని ప్రదర్శించడంతో క్రీడాకారులు పోటీ పడుతున్నారు. కార్యక్రమంలో గీతం క్రీడా విభాగం డైరెక్టర్ డాక్టర్ యు.విజయకుమార్, మేనేజర్ రితేష్ సిన్హ వివిధ క్రీడా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌తో
బహుళ ప్రయోజనాలు

సదస్సులో మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒ నారాయణ మూర్తి

ప్రజాశక్తి -భీమునిపట్నం : సోలార్ విద్యుత్ వినియోగంతో బహుళ ప్రయోజనాలున్నాయని పలువురు వక్తలు స్పష్టం చేశారు.శనివారం సోలార్ గ్రామంగా ఎంపిక చేసిన అర్.తాళ్లవలసలో ఎపిఇపిడిసిఎల్ చిట్టివలస విభాగం ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహించారు.

సదస్సులో సంస్థ ఆపరేషన్స్ ఎస్ఇ జి శ్యాంబాబు మాట్లాడుతూ, ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ప్రయోజనాలను వివరించారు. దీనికి ప్రభుత్వం నుంచి రాయితీ పొందవచ్చున్నారు.జెడ్‌పి సిఇఒ నారాయణ మూర్తి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు సోలార్ విద్యుత్ వినియోగం దోహద పడుతుందన్నారు. డిపిఒ ఎం.శ్రీనివాస రావు, ఎస్‌బిఐ లీడ్ మేనేజర్ శ్రీనివాసరావు, జోన్-3 విద్యుత్ ఇఇ పోలాకి శ్రీనివాసరావు, ఇఒపిఆర్‌డి కనకల రమేష్-నాయుడు, టిడిపి మండల అధ్యక్షులు డిఎవన్ రాజు పాల్గొన్నారు.

సన్ ఇనిస్టిట్యూట్‌పై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ధర్నా : పోలీసులకు ఫిర్యాదు

కాలేజీ వద్ద ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి-పెందుర్తి : ప్రభుత్వ గుర్తింపు లేకుండా అనధికారికంగా నిర్వహిస్తున్న జివిఎంసి 97వ వార్డు సుజాతనగర్ శివారులో ఉన్న సన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ కాలేజీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు డిమాండ్ చేశారు. శనివారం కాలేజీ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు లేకుండా అనధికారికంగా విద్యార్థులను చేర్చుకొని ఎటువంటి తరగతులు కానీ, ల్యాబ్‌లుగానీ నిర్వహించకుండా వేలల్లో ఫీజులు వసూలు చేసి విద్యార్థులను మోసం చేస్తున్నారని ఆరోపించారు అగ్రికల్చర్, ఫిజియోథెరపీ, పారా మెడికల్ కోర్సుల్లో విద్యార్థులను చేర్చుకొని పరీక్షలు నేటికీ 11 నెలలు గడుస్తున్నా వారికి తరగతులుగానీ, ల్యాబ్‌లుగానీ, పరీక్షలు గానీ నిర్వహించలేదన్నారు. కౌన్సిలింగ్ ద్వారా చేరిన విద్యార్థుల నుంచి ప్రభుత్వ ఫీజుగా రూ. 30వేలతోపాటు అదనంగా కాలేజీ నిర్వహణ పేరుతో మరో రూ.60వేలు, బిల్డింగ్ ఫండ్‌గా మరో రూ.15వేలు వసూలు చేశారన్నారు ఫిజియోథెరపీ విభాగంలో ప్రిన్సిపల్,సిబ్బంది లేరని, అడ్మిషన్ సమయంలో రెగ్యులర్ క్లాసులకు కెజిహెచ్‌కు తీసుకెళతామని చెప్పిన యాజమాన్యం అటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. కాలేజీలో ల్యాబ్‌లు, సరైన పరికరాలు, మౌలిక వసతులు లేవని, రాజస్థాన్‌లోని ఒక ప్రైవేట్ యూనివర్సిటీ పేరుతో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి, సర్టిఫికెట్లను ఇచ్చి మోసం చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం పెందుర్తి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విశాఖ పర్యటనకు వచ్చిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశామని, దీనిపై తగు చర్యలకు అధికారులకు ఆదేశాలిచ్చారని ఎస్ఎఫ్ఐ నేతలు వెల్లడించారు.కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.రామ్మోహనరావు, జిల్లా నాయకులు అజయ్, వెంకటరమణ, సాయితేజ, గుణ, భారత్, నరేష్, అఖిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయశ్రీ ఆర్గానిక్ ఫార్మా

బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

- ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ

- క్షతగాత్రులకు పరామర్శ

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని ఫార్మాసిటీలోని విజయ శ్రీఆర్గానిక్స్ కంపెనీలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. విజయ శ్రీ ఆర్గానిక్స్ కంపెనీలో శుక్రవారం సాయంత్రం 4.30 గంటల సమయం వద్ద ఏజిటెటర్ నచ్చ్ ఫిల్టర్ డ్రయ్యర్ (ఏఎన్ఎఫ్‌డి) 103 వద్ద జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు గాయపడ్డారు. ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన ఎన్ఎంఆర్ కార్మికుడు రాజు(25)కు రెండు చేతులు 30 శాతం కాలిపోగా, పరవాడ మండలం బరణికం పంచాయతీ బాపడుపాలెం గ్రామానికి చెందిన సిహెచ్ వెంకట సత్య సుబ్రహ్మణ్య స్వామి (59) (ఆపరేటర్) తలపై గాయాలయ్యాయి. విశాఖ ఇండస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను సిఐటియు నేత గనిశెట్టి సత్యనారాయణ శనివారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. వారు పూర్తిస్థాయిలో కోలుకునే వరకు పూర్తిస్థాయి వేతనం చెల్లించాలని, వైద్య సహాయం పూర్తిగా యాజమాన్యమే చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, నాయకులు టి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న సిఐటియు నేతలు గనిశెట్టి, వివి.శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు

అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ఈశ్వరరావు

హెల్మెట్ ధారణపై అవగాహన

ప్రజాశక్తి - యలమంచిలి

జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులంతా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని యలమంచిలి ట్రాఫిక్ ఎస్ఐ ఈశ్వరరావు అన్నారు. మండలంలోని రేగుపాలెం హైవే జంక్షన్‌లో శనివారం హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించని వాహనదారులకు జరిమానా విధించారు. మున్సిపాలిటీ, రాష్ట్ర రహదారులపై ప్రయాణించే వాహన దారులపై ఎటువంటి ఆంక్షలు లేవని, ముఖ్యంగా జాతీయ రహదారిపై ప్రయాణించే వాహన దారులు మాత్రం హెల్మెట్ ధరించాలని సూచించారు. లేనిచో రూ.150 రూపాయలు జరిమానా కట్టాల్సి ఉంటుందన్నారు. శనివారం హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న సుమారు 70 మందిపై కేసులు పెట్టడం జరిగిందన్నారు.

ఫసల్ బీమా పథకంపై అవగాహన

ప్రజాశక్తి-దేవరాపల్లి

ప్రతి రైతు ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకాన్ని వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అదికారి బి. మోహన్ రావు రైతులకు సూచించారు. మండలంలోని కాశీపురం గ్రామంలో శనివారం పర్యటించి పంట కోత ప్రయోగాలను పరిశీలించారు. పంట కోత ప్రయోగంలో ఆమర - 1064 అనే వరి రకంను పంట కోత ప్రయోగం చేయగా 13.370 గ్రాములు దిగుబడి వచ్చిందని తెలిపారు. పంటకోత ప్రయోగాలు కచ్చితంగా పద్ధతి ప్రకారం చేయాలని సూచించారు. ఏ ఒక్క వ్యవసాయ సిబ్బంది నిర్లక్ష్యం చేయకుండా పంట కోత ప్రయోగాలు చేయాలన్నారు. కాశీపురం గ్రామంలో రైతులతో మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరి బీమా చేయించుకోవాలని కోరారు. నెట్ సెంటర్‌కి రైతు ఆధార్ కార్డు జిరాక్స్, 1బి జిరాక్స్, బ్యాంక్ బుక్ జిరాక్స్, ఆధార్‌కి లింక్ అయినా ఫోను నెంబర్ పట్టుకొని వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ఎల్‌వై కాంతమ్మ, ఏఈఓ కిరణ్ కుమార్, ఆర్‌బికే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు

మామిడితోటలకు బీమా పథకం అమలు

ప్రజాశక్తి-కె.కోటపాడు

రాష్ట్ర ప్రభుత్వం 2024-25 రబీలో మామిడితోటలకు వాతావరణ ఆధారిత (అధికవర్షం లేదా అకాలవర్షాలు, వాతావరణంలో అధిక తేమశాతం, అధికఉష్ణోగ్రత) స్వచ్ఛంద బీమా పథకం అమలులోకి తీసుకువచ్చిందని ఉద్యానవన శాఖ అధికారిణి అర్.కిరణ్మయి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఒక ఎకరం మామిడితోటకు బీమా హామీ మొత్తం రూ.44,000 వర్తిస్తుందని, ఈ మొత్తంలో బీమా ప్రీమియం ఐదుశాతంగా రూ.2,200 చెల్లించాలన్నారు. ఈ నెల 15వ తేదీలోగా ప్రీమియంను ఏఐసీ(అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్)కు చెల్లించాలన్నారు. మామిడిపంట రుణం పొందిన రైతులు బ్యాంక్‌లో స్వచ్ఛంద డిక్లరేషన్ సమర్పిస్తేచాలని పేర్కొన్నారు. బ్యాంక్ రుణం పొందని రైతులు పీఏసీఎస్, బ్యాంకు అధికారులను, ఏఐసీ కంపెనీ వారిని లేదా నేరుగా నేషనల్ క్రాప్ ఇన్సూరెన్సు పోర్టల్ (ఎన్.సి.ఐ.పి) యాప్ ద్వారా కూడా రైతు ప్రీమియం చెల్లించవచ్చునని హెచ్ఓ కిరణ్మయి వివరించారు. ఆధార్ కార్డు, భూమి పత్రాలు, పంటసాగు ధ్రువీకరణపత్రం, బ్యాంక్ పాస్ బుక్ కాపీ, ఫోన్ నంబర్లతో దరఖాస్తు చేయాలని చెప్పారు. మరిన్ని వివరాలకు తమను సంప్రదించవచ్చన్నారు. మండలాన్ని యూనిట్‌గా పరిగణిస్తామని వివరించారు.

లోకేష్‌ను కలిసిన నాగ జగదీష్

ప్రజాశక్తి-అనకాపల్లి

విశాఖపట్నం విచ్చేసిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీష్ శనివారం విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

లోకేష్‌ను కలిసిన నాగజగదీష్ తదితరులు

గ్రామాల్లో వైద్య శిబిరాలు

ప్రజాశక్తి-సీలేరు : జికె.వీధి మండలం దుప్పిలివాడ సచివాలయం పరిధి వలసగెడ్డ, వలస గెడ్డకొత్తూరు, శాండికోరి, బూషికొండ తదితర గ్రామాల్లో శనివారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఖాదర్ మస్తాన్ వల్లి మాట్లాడుతూ ప్రతి నెల ఎంపికైన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఉచితంగా నిర్వహిస్తున్నామని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జ్వరాలు ఇతర వ్యాధులు వచ్చినప్పుడు అశ్రద్ధ చేయకుండా స్థానిక ప్రభుత్వాసుపత్రికి సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కే.జోజిబాబు, ఆరోగ్య పర్యవేక్షలు బి.బాలమణి, వైద్య సిబ్బంది సత్యనారాయణ, కుమారి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు చుట్టూ వాకింగ్ ట్రాకింగ్ సిద్ధం

ప్రజాశక్తి - యలమంచిలి

యలమంచిలి నడిబొడ్డున గల కొమ్మయ్య గుండం చెరువు చుట్టూ వాకింగ్ ప్రియుల కోసం వాకింగ్ ట్రాక్ సిద్ధం చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు శనివారం ప్రకటించారు. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న ఈ వాకింగ్ ట్రాక్ సిద్ధం చేయడానికి సుమారు రూ.80 లక్షలకు పైగా ఖర్చు చేసినట్టు పేర్కొన్నారు. ఈ చెరువు లోతు తవ్వి, స్విమ్మింగ్ పూల్, వాకింగ్ ట్రాక్, పార్కు కోసం కృషి చేసిన వైస్ చైర్మన్ ఆరెపు గుప్తాను పలువురు అభినందించారు. త్వరలోనే వాకింగ్ ట్రాకింగ్ చుట్టూ ఆహ్లాదపరిచే మొక్కలు పెంచే కార్యక్రమం కూడా చేపడ్డం జరుగుతుందని శానిటరీ ఇనస్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు తెలిపారు. అన్నాక్యాంటీన్ ఆనుకొని ఉండే ఈ వాకింగ్ ట్రాక్ విద్యార్థులు, మహిళలు, యువకులకు, ఉద్యోగులకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఇక్కడ భవిష్యత్తులో పిల్లలు ఆడుకొనే జిమ్ కార్యకలాపాల కోసం అనువైన పరికరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఇ సుబ్బారావు, మున్సిపల్ శానిటరీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ చుట్టూ తుప్పలను తొలగిస్తున్న దృశ్యం

ఘనంగా శ్రీ చైతన్య నాలెడ్జ్ హబ్ స్కోర్ ఫెస్ట్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ

డాబాగార్డెన్‌లోని అల్లూరి సీతారామ రాజు విజ్ఞాన కేంద్రంలో శ్రీ చైతన్య అకాడమీ నాలెడ్జ్ హబ్ స్కోర్ ఫెస్ట్ వేడుకను శనివారం నిర్వహించారు. ఇటీవల జరిగిన స్కోర్ ఫెస్ట్ పరీక్షలో నగర పరిధిలోని 43 స్కూళ్ల నుంచి 12 వేల మంది విద్యార్థులు పాల్గొనగా 22 మంది ప్రతిభా స్కాలర్‌షిప్ పురస్కారం కింద నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రాంతీయ అకడమిక్ డైరెక్టర్ నాగరాజు, ప్రాంతీయ వ్యాపార అధిపతి జి.వేణుగోపాల్‌రెడ్డి, క్లస్టర్ బిజినెస్ హెడ్ జి.విశ్వనాథ్, బ్రాంచ్ హెడ్ మద్దాల అరుణ్ స్వరూప్, అకడమిక్ హెడ్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, నాలెడ్జ్ హబ్ సెంటర్లలో అత్యుత్తమ ఫలితాలు సాధించి నీట్ 2024లో 18 మంది విద్యార్థులు 700/720 కంటే ఎక్కువ స్కోర్ చేశారని, 85 శాతం మంది టాప్ పర్సంటైల్‌లో ర్యాంకులు సాధించారని తెలిపారు. జెఈఈ-మెయిన్స్ 2024లో 72 శాతం మంది విజయం సాధించారన్నారు. జెఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించి 40 శాతం కంటే ఎక్కువ మంది విద్యార్థులు భారతదేశంలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన సంస్థల్లో ప్రవేశాలు పొందారని వివరించారు. 11, 12 తరగతులకు నీట్, ఐఐటి- జెఈఈకి కోచింగ్ అందివ్వటం, 7 నుంచి 10 తరగతులకు ఫౌండేషన్ కోర్సులు, ఒలింపియాడ్స్ ఇతర పోటీ పరీక్షలకు ప్రిపరేషన్ ఇవ్వడం శ్రీ చైతన్య అకాడమీ ప్రత్యేకత అని నిర్వాహకులు తెలిపారు.

జ్ఞాపిక అందజేస్తున్న శ్రీ చైతన్య ప్రతినిధి

మెటీరియల్ చూపుతున్న దృశ్యం

ఇంటర్‌లో ఉత్తీర్ణత పెంచేందుకు 'సంకల్ప'

ప్రజాశక్తి-సబ్బవరం

ఇంటర్‌లో ఉత్తీర్ణత పెంచేందుకు సంకల్ప అనే కార్యక్రమాన్ని ఇంటర్మీడియేట్ బోర్డు కమిషనర్ వారు చేపట్టినట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఇంచార్జి ప్రిన్సిపాల్ పివిఎన్ మూర్తి తెలిపారు. సంకల్ప కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కళాశాలలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచడానికి విద్యార్థులకు క్వశ్చను బ్యాంకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసినట్లు తెలిపారు. కళాశాల అధ్యాపకులు ఇంటర్మీడియట్ సి.గ్రేడ్ విద్యార్థులు 56 మందికి క్వశ్చన్ బ్యాంకు స్టడీ మెటీరియల్ అందజేశారు. త్వరలో బి గ్రేడ్ విద్యార్థులకు కూడా క్వశ్చన్ బ్యాంకు, స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తామని మూర్తి తెలిపారు.

కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-అరకులోయరూరల్

అరకు రైల్వే స్టేషన్ పరిధిలో పని చేస్తున్న రన్నింగ్ రూమ్, కార్మికులు, స్లీపర్స్, గెస్ట్ హౌస్‌లో, రైల్వే ట్రాక్‌లో పని చేస్తున్న కార్మికులకు చట్ట ప్రకారం కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అరకు రైల్వే స్టేషన్ రన్నింగ్ రూమ్ అధికారికి రైల్వే కాంట్రాక్ట్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) అనుబంధం ఆధ్వర్యంలో డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, గత ఐదు సంవత్సరాల నుండి పని చేస్తున్న కార్మికులకు రైల్వే కాంట్రాక్టర్లు చట్ట ప్రకారం జీతాలు చెల్లించకుండా రైల్వే బోర్డు ఇస్తున్న వేతనంలో కోత విధిస్తున్నారని తెలిపారు. పిఎఫ్, ఈఎస్ఐ పేరుతో జీతాల్లో కోత విధిస్తున్నారన్నారు. విశాఖ డిఆర్ఎంకి కాంట్రాక్టర్‌పై ఫిర్యాదు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మహేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి-కూనవరం

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తున్నట్లు సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు అన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నాగేశ్వరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళ లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ ఎంతో కృషి చేశారని తెలిపారు. ప్రతి పౌరునికి హక్కులు కల్పించే విధంగా రాజ్యాంగ రచన చేశారని కొనియాడారు. నేడు కేంద్ర, రాష్ట్ర పాలకులు సగటు సామాన్యులకు హక్కుల కాలరాస్తున్నారని విమర్శించారు. ప్రతి ఒక్కరూ హక్కులు పొందేలా ప్రభుత్వాలు, నాయకులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, నాయకులు గడ్డిపాటి షణ్ముఖరావు, నోముల సత్యనారాయణ, కర్నాటి శ్రీనివాసరావు, ధన్నూరి శ్రీనివాసరావు, కొండా ఈశ్వర్లు, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

60 కేజీల గంజాయి స్వాధీనం

ఎనిమిది మంది నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-కశింకోట

ఏజెన్సీ నుండి బొలెరో వాహనంలో తరలిస్తున్న 60 కేజీల గంజాయిని కశింకోట మండలం అచ్చెర్ల జంక్షన్ ఎస్ఐ కె.లక్ష్మణరావు, సిబ్బంది సహాయంతో శనివారం పట్టుకున్నారు. కశింకోట సిఐ అల్లు స్వామి నాయుడు తెలిపిన వివరాలు ప్రకారం... ముందస్తు సమాచారం మేరకు పోలీసులు అచ్చెర్ల జంక్షన్ వద్ద మాటువేశారు. ఈ సమయంలో అటుగా పైలెట్‌గా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని, వెనుక వస్తున్న బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. బొలెరో వాహనంలో 60 కేజీల గంజాయిని గుర్తించారు. గంజాయితో పాటు బొలెరో వాహనాన్ని, బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్న అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన గెమ్మిలి సుబ్బారావు, కొర్రా చంద్రబాబు, బాల నేరస్తుడు గెమ్మిలి రవి, తమిళనాడుకు చెందిన పి.రాజా, మగేష్ , మరాసు సెల్వం, మోహన్ తదితర ఎనిమిది మందిని అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన ముద్దాయిలు గంజాయి కొనే వ్యక్తి తమిళనాడుకు చెందిన సేతురాం, గంజాయి అమ్మిన జి.మాడుగుల మండలంకు చెందిన చిక్కుడు కొండబాబు, వెంకటరావు పరారీలో ఉన్నారు. దీనిపై కశింకోట సిఐ అల్లు స్వామి నాయుడు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

అదనపు బోగీలు ఏర్పాటుపై హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి

రైల్వే ప్రయాణికుల రద్దీ దృష్ట్యా, అనేక లక్షల మంది జనరల్ కంపార్ట్మెంట్లో ప్రయాణం చేయడానికి నానా అవస్థల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రతి ట్రైన్‌కు రెండు అదనపు బోగీలు ఏర్పాటు చేయడం పట్ల టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అదనపు బోగీలు వేయాలని రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు అనేక పర్యాయాలు రైల్వే శాఖకు విన్నవించడం జరిగిందని గుర్తు చేశారు. ఎట్టకేలకు సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్లు ప్రతి ట్రైన్ కు రెండు అదనపు బోగీలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకున్నందుకు ప్రధాన మోడీకి, రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. దక్షిణ మధ్య రైల్వేలో 40 ట్రైన్లకు 146 బోగీలు పెంచు తున్నట్లుగా జనరల్ మేనేజర్ ప్రకటించారని, ప్రస్తుతం 19 ట్రైన్లకు 66 భోగీలను ఏర్పాటు చేస్తున్నారని వెంకటరావు తెలిపారు. గతంలో సీనియర్ సిటిజన్స్‌కి థర్డ్ ఏసీలో రాయితీతో కూడిన ప్రయాణానికి అవకాశాలు కల్పించారని, కరోనా సమయంలో రద్దు చేశారని, దీన్ని పునరుద్ధరణ చేయ వలసిందిగా అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్, రైల్వే శాఖ మంత్రి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మాట్లాడుతున్న వెంకటరావు

భిక్ష ఏర్పాటు చేసిన వారికి సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక సుంకరమెట్ట శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానంలో శ్రీ గౌరీ పంచాయతన దేవస్థానంలో మాల వేసుకున్న స్వాములకు భిక్ష కార్యక్రమం 41 రోజులు పాటు దిగ్విజయంగా ఏర్పాటు చేసిన గౌరవ కమిటీ సభ్యులు విల్లూరి రాజేష్, కాంట్రాక్టర్ సురేష్ విల్లూరి త్రినాథ్‌లను శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్ బొడ్డేడ మురళి ప్రత్యేక పూజలు చేయించి సాలువ వేసి సత్కరించారు. ఈ 41 రోజుల భిక్ష కార్యక్రమానికి సహకరించిన బుద్ధ జగన్ మిత్రమండలి, కాంట్రాక్టర్ బుజ్జి, ప్రకాష్ మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు మారిశెట్టి భాస్కరరావు పెంటకోట చంద్రరావు శ్రీకాకుళం గణపతి పాల్గొన్నారు.



స్వాములను సత్కరిస్తున్న దృశ్యం

అంగన్వాడీ భవన నిర్మాణానికి రూ.10 లక్షలు

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరు మేజరు పంచాయతీ పరిధి చింతపల్లి క్యాంపులో అంగన్వాడీ కేంద్రం భవనం నిర్మాణానికి ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద రూ.10 లక్షలు మంజూరైనట్లు సర్పంచ్ పాంగి దుర్గో తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ట్రైబల్ వెల్ఫేర్ వర్క్స్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ శనివారం చింతపల్లి క్యాంపు అంగన్వాడీ కేంద్ర నిర్మాణానికి కొలతలు వేశారని తెలిపారు. ఈ పనులు దక్కించుకున్న గుత్తేదారుడు ఎ.అప్పలనాయుడు, సబ్ కాంట్రాక్టర్ పి.పాపారావుకి పనులు అప్పగించినట్లు చెప్పారు. ఈ పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వం నూతనంగా అంగన్వాడి కేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో సమస్యలు తీరనుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కే. వల్లి ప్రసాద్, అంగన్వాడీ టీచర్ ఈశ్వరి, సబ్ కాంట్రాక్టర్ పాపారావు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి మహోత్సవం

కార్యక్రమంలో పాల్గొన్న పీలా గోవింద తదితరులు

ప్రజాశక్తి-అనకాపల్లి

స్థానిక శ్రీ భోగలింగేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యేశ్వర స్వామి షష్టి మహోత్సవాలు సందర్భంగా శనివారం వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవం ఆలయ నిర్వహకులు బుద్ధ శివాజీ కుమారులు చిరంజీవి దంపతులు, ఓం శివ దంపతులు నిర్వహించారు. రాష్ట్ర మున్సిపల్ అర్బన్ ఫైనాన్స్ మౌలిక సదుపాయాల కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై స్వామి వారి పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పీలాను శాలువాతో సత్కరించి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ కాంట్రాక్టర్ సత్యనారాయణ, ఆలయ ధర్మకర్తలు పెంటకోట గణేష్, మళ్ల సూరిబాబు, మద్దాల నారాయణరావు, రాపేటి నాగ సంతోష్, దూలం సత్యవతి, కార్యనిర్వాహణాధికారి మురళీకృష్ణ, కొణతాల రామకృష్ణ గురుస్వామి, ఆలయ అర్చకులు పేరూరి సూర్యనారాయణ, చిన్ని స్వామి, నారాయణరావు, హరినాథ్ పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని అంతకాపల్లి, గుల్లేపల్లి గ్రామాలలో సుబ్రమణ్యేశ్వర స్వామి షష్టి మహోత్సవాలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుండి స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. గుల్లేపల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి దేవాలయంలో వైసిపి పెందుర్తి నియోజకవర్గం నాయకులు గండి రవికుమార్ స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు బోను నాయుడు, బండారు శ్రీను, నెబర్తి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ సిరపరపు వాసు, తుంపాల శివ, నంబారు రాజబాబు, బోకం సూర్యనారాయణమూర్తి, గండి రవికుమార్ యువ సైన్యం పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండల కేంద్రంలోని శివాలయ ప్రాంగణంలో ఉన్న సుబ్రహ్మణ్య స్వామికి కోటపాడు శివాలయం పీఠం అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యస్వామి వారికి విశిష్ట పూజలు జరిగాయి. శనివారం ఉదయం తెల్లవారుజాము నుంచి రాణీ భైరవ వేణుగోపాలస్వామి ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్యస్వామికి పూజా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు భూపతి అప్పలరాజు, బండారు ముత్యాల నాయుడు, అయ్యప్ప స్వాములు, శివ స్వాములు, భవానీలు పాల్గొన్నారు.

నక్కపల్లి : మండలంలోని ఉపమాక, గొడిచెర్ల, డి కొత్తూరు గ్రామాల్లోని ఆలయాల్లో శనివారం సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉపమాక శివాలయంలో ఆలయ అర్చకులు మహేష్ పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గొడిచెర్ల, డి కొత్తూరు గ్రామాల్లో అన్న సమారాధన నిర్వహించారు.



సుబ్రహ్మణేశ్వరస్వామిని దర్శించుకున్న వైసిపి నేత గండి రవి కుమార్

మత్స్యకారులకు వేట నిషేధ భృతి ఇవ్వాలి

-సిపిఎం నేతల నిరసన

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: మండలంలో మత్యకారులకు వేట నిషేద భృతి రూ.20,000 ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి ఎం. సత్యనారాయణ డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా శనివారం అయన రేవుపోలవారం గ్రామ మాత్యకారులతో కలిసి నిరసన చేపట్టారు. కూటమి ప్రభుత్వం గత ఎన్నికల హామీలో మత్స్యకారులకు అండగా ఉంటామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన తరువాత మరిచిపోయిందని విమర్శించారు. జులై లో ఇవ్వాల్సిన భృతి నేటికీ అందక మత్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మత్స్యకారులకు ఇవ్వాల్సిన వేట నిషేధ భృతి ఇవ్వకపోతే మత్యకారులంతా ఐక్యమై పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వాసపల్లి అప్పన్న, మత్యకారులు ఎరిపల్లి ముసిలి, బొడ్డుమాధవ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

విజయవంతంగా పేరెంట్, టీచర్ సమావేశాలు

ఎస్.రాయవరంలో మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

ప్రజాశక్తి -ఎస్.రాయవరం: నిరంతరం విద్యార్థులను తల్లిదండ్రులు ఉపాధ్యాయులు గమనిస్తుండాలని హెూంమంత్రి అనిత సూచించారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, గడచిన ఆరు నెలల్లో ప్రభుత్వం విద్యాశాఖలో ఎన్నో మార్పులు తీసుకువచ్చిందన్నారు. టీచర్స్‌కు, విద్యార్థులకు మధ్య అవినాభావ సంబంధం ఉండాలని విద్యాశాఖ దృష్టి పెట్టిందన్నారు. పిల్లలతో హెూం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి బొలిశెట్టి గోవిందరావు, యస్ఎంసి చైర్మన్ బత్తుల వాసు, తెదేపా మండల అధ్యక్షులు అబద్ధం, కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

నక్కపల్లి :మండలంలోని ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ పేరెంట్ -టీచర్ సమావేశాన్ని ఎంఈఓ లు నరేష్, వేమగిరి నూకరాజుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించారు.

రావికమతం:రావికమతం జడ్పీ హైస్కూల్ పాఠశాలలో తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి చోడవరం శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు, పాఠశాల విద్యా కమిటీ అందరి భాగస్వామ్యంతో పిల్లల బంగారు భవిష్యత్తుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు.ఎంపీపీ పైల రాజు, సర్పంచ్ మోది నాయుడు, హెచ్ఎం మల్లికార్జునరావు, ఎస్ఎంసి చైర్మన్ అప్పారావు పాల్గొన్నారు.

నాతవరం: మండలంలోని డి.ఎర్రవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కార్యక్రమానికి స్పీకర్ చింతకాయాల అయ్యన్న పాత్రుడు హాజరయ్యారు.విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్టులను అందజేశారు. పిల్లలను టీవీ, ఫోన్లకు దూరంగా ఉంచేందుకు సమయపట్టిక అమలు చేయాలని సూచించారు. ఆర్డీవో రమణ పాల్గొన్నారు.

కోటవురట్ల:మండలంలోని పలు పాఠశాలల్లో పేరెంట్, టీచర్స్ సమావేశాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో తహసిల్దారు తిరుమలబాబు, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు

మాకవరపాలెం:పాఠశాలలో నిర్వహించే ఇటువంటి సమావేశాలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య బలమైన బంధాన్ని ఏర్పరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మాకవరపాలెం మండలం తామరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్ డే సమావేశం అట్టహాసంగా జరిగింది. స్పీకర్ ముందుగా విద్యార్థులకు ప్రోగ్రెస్ రిపోర్టులను అందజేశారు. ఆర్డీవో రమణ పాల్గొన్నారు.

గొలుగొండ:గొలుగొండ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్ టీచర్ సమావేశంను నిర్వహించారు. ఈ కార్యక్రమంకు సుమారు 250 మంది తల్లిదండ్రులు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ గజ్జలపు మణికుమారి, ఎంపిటిసి చేపల చినపాప, గొలుగొండ సర్పంచ్ కసిపల్లి అప్పారావు, ఎస్సై రామారావు, ఎస్ఎంసి చైర్మన్ చిట్ల చలపతి, వైస్ చైర్మన్ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఏ ఎల్ పురం మేజర్ పంచాయతీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా తల్లిదండ్రుల సమావేశం ప్రధానోపాధ్యాయులు వి.నాగభూషణం, మండల విద్యాశాఖధికారి ఏవిఎస్ఎన్.మూర్తి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ లోచల సుజాత, మాజీ జెడ్పిటిసి చిటికెల తారక వేణుగోపాల్, ఎస్సై తారకేశ్వరరావు పాల్గొన్నారు.

రోలుగుంట:రోలుగుంట జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నాగేశ్వరరావు, ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అనకాపల్లి:విద్యార్థులు తమ విద్యపై దృష్టి కేంద్రీకరించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా అన్నారు. జీవీఎంసీ ప్రధాన ఉన్నత పాఠశాలలో మెగా టీచర్స్ పేరెంట్ మీటింగ్‌లోని ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా దూరంగా ఉండాలని డ్రగ్స్ వద్దు బ్రో అనే ప్రత్యేక నినాదం పోస్టర్లను విడుదల చేశారు. డిఎస్పీలు బి.అప్పారావు, ఎం శ్రావణి, టౌన్ సిఐ విజయ్ కుమార్, ఎస్సైలు వి సత్యనాయరణ, డి. ఈశ్వరరావు, స్కూల్ హెచ్ఎం బ్రహ్మాజీ పాల్గొన్నారు. తుమ్మపాల జెడ్పిలో హైస్కూల్ కమిటీ చైర్మన్ బలరాం, మామిడిపాలెంలో ఎస్ఎంసి చైర్మన్ మాకవరపు పరమేశ్వరి, అనకాపల్లి గవరపాలెం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఎస్ఎంసి చైర్మన్ పద్మావతి ఆధ్వర్యంలో సమావేశాలు జరిగాయి.

కశింకోట : కశింకోట జెడ్పి బాలికల, డిపిఎన్ పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్, టీచర్స్ మీట్‌లో శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. పీలా గోవింద సత్యనారాయణ, గొంతిని శ్రీనువాసరావు, వేగి గోపికృష్ణ, ఎంఇఒ2 సూర్య నారాయణ మూర్తి, సర్పంచ్ జయ రజిని పాల్గొన్నారు.

బుచ్చయ్యపేటలో..

సబ్బవరం : క్రమశిక్షణతో కూడిన విద్యను ప్రతి విద్యార్థి అభ్యసించాలని విశాఖపట్నం డిఐజి గోపీనాథ్ జెట్టి కోరారు. స్థానిక గురుకులంలో జరిగిన తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశానికి డి.ఐ.జి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఆయన మాదకద్రవ్యాలు వాల్ పాస్టర్ ను ఆవిష్కరించారు. మల్లునాయుడుపాలెం పాఠశాలలో గండి బాబ్జి, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు పాల్గొని మాట్లాడారు.

బుచ్చయ్యపేట : విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో కషి చేస్తుందని హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు తెలిపారు. దిబ్బిడి హైస్కూల్‌లో పేరెంట్ టీచర్స్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సీతయ్యపేట, తురకలపూడి, రాజాం, పెద్దమదిన, గున్నెంపూడి పాఠశాలల్లోనూ సమావేశాలు జరిగాయి. కార్యక్రమంలో హెచ్ఎం కె.సత్యారావు, చైర్మన్ అప్పారావు పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది కెజిబివి, ఎంపీపీ స్కూల్, ఎల్‌బిపి అగ్రహారం, బంగారు మెట్ట, కోమలపూడి తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో జరిగిన పేరెంట్స్ మీటింగ్‌ల్లో రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కెజిబివి ప్రత్యేక అధికారి కోసూరి అన్నపూర్ణ, పివి శేషుబాబు, ఎస్ఎంసి చైర్మన్ సత్యవేణి పాల్గొన్నారు.

మునగపాక : స్థానిక జడ్పీ హైస్కూల్లో తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల మెగా ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. అనంతరం ఇటీవల రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో పాల్గొన్న పదవ తరగతి విద్యార్థిని ఆడారి మౌనిక అన్నపూర్ణను ఘనంగా సత్కరించారు. ఎండిఓ ఉషారాణి, ఎస్సై ప్రసాదరావు, ఎంఈఓలు వేణుగోపాలరావు, శివ నాయుడు పాల్గొన్నారు. తిమ్మరాజుపేట హైస్కూల్‌లో జరిగిన గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ ఆడారి మంజు పాల్గొన్నారు.

యలమంచిలి : యలమంచిలి కొత్తపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో సమావేశానికి రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు హాజరై మాట్లాడారు. సిఐ ధనుంజయరావు, ఎంఇఒ అరుణ్‌కుమార్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కొఠారు సాంబ, బొద్దపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చోడవరం : చోడవరం మండలంలో6 1 ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్ టీచర్ సమావేశాల నిర్వహించారు. శాసనసభ్యులు కెఎస్ఎన్ఎస్.రాజు స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, లక్ష్మీపురం ఉన్నత పాఠశాలలకు హాజరై మాట్లాడారు. లక్ష్మీపురంలో గణిత ప్రయోగశాలను ప్రారంభించారు. గూనూరు మల్లు నాయుడు, ఎంపిపి గాడి కాసు, ఉపాధ్యక్షులు ఈశ్వరరావు, ఎంపిటిసి రూపా దేవి, అధికారులు పాల్గొన్నారు.

చోడవరం రూరల్ : మండలంలో ఉన్న పలు స్కూళ్లలో తల్లిదండ్రులు టీచర్ల ప్రోగ్రాంలో చోడవరం సిఐ అప్పల రాజు, సిబ్బంది పాల్గొని ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు.

కె.కోటపాడు : స్థానిక జెడ్పి హైస్కూల్‌లో సమావేశానికి స్థానిక తహసిల్దార్ పీ భాగ్యవతి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. పాఠశాల హెచ్ఎం పద్మావతి, కూటమి నాయకులు పాల్గొన్నారు. కింతాడ శివారు గొల్లల పాలెం కెజిబివి పాఠశాలలో ప్రిన్సిపల్ బి చిన్నమ్మలు, టిడిపి నేతలు కసిరెడ్డి అప్పలనాయుడు, బండారు నరసింహనాయుడు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

దేవరాపల్లి : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎంపీపీ స్కూల్, మెయిన్ స్కూల్లో జరిగిన ఆత్మీయ సమావేశాలలో మాజీ ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపిటిసి మొల్లి కృష్ణమూర్తి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాల్లో ఎంఇఒ బి. పడాల్ దాసు, ఎంఇఒ-2 ఉషారాణి, ప్రత్యేక అధికారి భవనమాధురి, ఎంపీడీవో సువర్ణరాజు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

గోపాలపట్నం : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. నరవ జెడ్పి హైస్కూల్‌లో మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశంలో మాట్లాడుతూ, విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన, గుణాత్మక విద్యను అందించడం, అందులో తల్లిదండ్రులను భాగస్వామ్యం చేసి, వారి సలహాలు, సూచనలు, సహాయ సహకారాలతో అనుకున్న లక్ష్యం చేరుకోవడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. వివిధ పోటీలను నిర్వహించి, బహుమతులను అందించారు.

92వ వార్డు పద్మనాభనగర్ ప్రభుత్వ హైస్కూల్లో టిడిపి విశాఖ పార్లమెంటరీ ఉపాధ్యక్షులు నందవరపు సోములు మాట్లాడారు.

ఆనందపురం : నెత్తరు కస్తూర్బా పాఠశాలలోతల్లిదండ్రుల సమావేశంలో మధురవాడ డిఎస్పి సాగర్ పాల్గొని, డ్రగ్స్, మత్తుపదార్థాల అనర్థాలపై అవగాహన కల్పించి, పోస్టర్ ఆవిష్కరించారు. ఎంఇఒ గంగరాజు, సుభాష్ చంద్రబోస్, చైర్మన్ కె.శివాజీ, మంగ, ప్రిన్సిపల్ లావణ్య పాల్గొన్నారు.

కరాస: జివిఎంసి 52వ వార్డు కరాస జివిఎంసి ప్రాథమిక పాఠశాలలో ఐద్వా ఆధ్వర్యంలో పేరెంట్స్ మీటింగ్‌లో ప్రముఖ మానసిక వైద్యులు, డాక్టర్ ఎన్ఎన్ రాజు పాల్గొని, ఒత్తిడి లేకుండా విద్యార్థులను చదివించడంపై అవగాహన కల్పించారు. హెచ్ఎం భారతీదేవి, ఐద్వానేతలు సి హెచ్ సుమిత్ర, కె.హేమలత, ఎం.సుధ పాల్గొన్నారు.

భీమిలిలో..

అనకాపల్లిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌పి

పెందుర్తి : జివిఎంసి 96వ వార్డు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పాల్గొన్నారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు. 96వ వార్డు పరిధి పెందుర్తి పాత ఊరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, స్కూల్ కమిటీ చైర్మన్ రాపేట జగదీష్, హెచ్ఎం కిరణ్మయి పాల్గొన్నారు

మధురవాడ : చంద్రంపాలెం హైస్కూల్ పేరెంట్స్ మీటింగ్‌లో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ,. హెచ్ఎం. రవి, కార్పొరేటర్లు మొల్లి హేమలత, నొడగల అప్పారావు, పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని. అనంతవరం, మద్ది కస్తూర్బా పాఠశాలలు, ఆర్.వెంకటాపురం, రెడ్డిపల్లి ఉన్నతపాఠశాలల్లో పేరెంట్స్ మీటింగ్‌లో ఎంపిపి రాంబాబు పాల్గొన్నారు. ఎంపిడిఒ ఎం.విజయకుమార్. తహశీల్దార్ కె ఆనందరావు, ఎంపిటిసి కె.లక్ష్మినాయుడు, సర్పంచ్ భవానీ, హెచ్ఎంలు కృష్ణకుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తగరపువలస : విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రులదే ప్రధాన బాధ్యత అని విశాఖ ఎంపి ఎం.శ్రీ భరత్ అన్నారు.చిట్టివలస జెడ్పి హైస్కూల్‌లో పేరెంట్స్ మీటింగ్‌లో పాల్గొన్నారు. జెడ్పిటిసి గాడు వెంకటప్పడు, డైట్ ప్రిన్సిపాల్ ఎం జ్యోతి కుమారి, ఎంఇఒలు శివరాణి, జయప్రద, ఎస్ఎంసి చైర్‌పర్సన్‌భాగ్యలక్ష్మి, హెచ్ఎం పొట్నూరు మురళీ మోహనరావు పాల్గొన్నారు.

ములగాడ: స్థానిక జివిఎంసి ఉన్నతపాఠశాలలో పేరెంట్స్ మీటింగ్‌లో ఎమ్మెల్యే పి.గణబాబు, అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆరిలోవ : శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకులంలో పేరెంట్స్ మీటింగ్‌లో నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ పాల్గొని, చెడు వ్యసనాలకు విద్యార్థులు దూరంగాఉండి, బాగా చదువుకోవాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ రత్నవల్లి, కార్పొరేటర్ సునీత సత్యనారాయణ, ఆరిలోవ సిఐ మల్లేశ్వరరావు పాల్గొన్నారు. తోటగరువు జెడ్పి ఉన్నత పాఠశాలలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామక్రిష్ణబాబు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఆర్‌జెడి భాస్కరరావు, వార్డు కార్పొరేటర్ రామలక్ష్మీ రాజశేఖర్, తహసిల్దారు పాల్‌కిరణ్, హెచ్ఎం భవాని పాల్గొన్నారు.

ఉక్కునగరం: వడ్లపూడి ప్రభుత్వ పాఠశాలలోతల్లిదండ్రులు ఆత్మీయ సమ్మేళనంలో 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం, విజయరామరాజు, ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

సీతమ్మధార : 26వ వార్డు ఎన్‌జివో కాలనీ జివిఎంసి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం బి. లక్ష్మినరస ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమావేశంలో ఉత్తర ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్‌రాజు, కార్పొరేటర్ శ్రావణి పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం పరిధి 39వ వార్డులోని క్వీన్ మేరీ హైస్కూల్, ఎంవిడిఎం స్కూల్, 31వ వార్డులోని రమాదేవి బానోజి స్కూల్, 32వ వార్డులోని రైల్వే స్కూల్, 34వ వార్డులోని అచ్చియ్యమ్మ పేట స్కూల్, 41వ వార్డులోని జ్ఞానాపురం స్కూల్లో తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు.

దేశం గర్వపడే విధంగా ఎదగాలి

-ఆదివాసీ యువతకు వక్తల పిలుపు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : భారతదేశం గర్వపడే విధంగా ఆదివాసి యువత ఎదగాలని జాతీయ గిరిజన యువ సమ్మేళనంలో వక్తలు పిలుపునిచ్చారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ (మై భారత్) ఆధ్వర్యాన 16వ జాతీయ గిరిజన యువ సమ్మేళనాన్ని గీతం యూనివర్శిటీలో శనివారం రాష్ట్రీయ ఇస్పాత్ నిఘం లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ఆపరేషన్స్) అరుణ్ కాంతి బాగ్చీ ప్రారంభించి మాట్లాడారు. ఆత్మ విశ్వాసంతో యువత ముందడుగు వేసినప్పుడే దేశం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందన్నారు. విభిన్న సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమైన భారతదేశంలో ఆదివాసీలు కూడా ఒక భాగమని పేర్కొన్నారు. దేశంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆదివాసీలు నేరుగా తిలకించేందుకు భారత ప్రభుత్వం, గృహ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వ శాఖ ద్వారా ఈ కార్యక్రమాన్ని నెహ్రూ కేంద్ర సంఘటన్ నిర్వహిస్తుందని ఆయన వివరించారు.

ఆత్మీయ అతిథి సిఆర్‌పిఎఫ్ 198వ బెటాలియన్ సెకండ్ ఇన్ కమాండెంట్ పాముల కిషోర్ మాట్లాడుతూ దేశ రక్షణలో ఆదివాసి యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. నెహ్రూ యువ కేంద్ర ఆంధ్రప్రదేశ్ సంచాలకులు అన్సుమన్ ప్రసాద్ దాస్ మాట్లాడుతూ, చదువు - పోరాడు - ముందుకు వెళ్లు అనే నినాదంతో యువత కృషి చేయాలని అన్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఎన్‌వైకె అధికారి గొర్లె మహేశ్వర రావు వారం రోజుల కార్యక్రమాలను వివరించారు. జిల్లా వినియోగదారుల న్యాయస్థానం సభ్యులు రహమున్నిషా బేగం, ఎన్‌యుజెఐ స్కూల్ అఫ్ జర్నలిజం వైస్ చైర్మన్ ఎన్.నాగేశ్వరరావు ప్రసంగించారు.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఛత్తీస్‌గడ్ లోని బస్తార్, మొహల్లా, మాన్పూర్ జిల్లాలు, ఒడిశాలోని కలహండి,

నృత్యం చేస్తున్న యువతులు

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అన్సుమన్ ప్రసాద్‌దాస్

కంధమాల్ జిల్లాలకు చెందిన యువత ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి భరత నాట్యం, కూచిపూడి, కోలాటం నృత్యాలను ప్రదర్శించారు. 16వ జాతీయ గిరిజన యువ సమ్మేళనలో ఛత్తీస్‌గడ్, ఒడిశా రాష్ట్రాల నుంచి 200 మంది ఆదివాసి యువతీ యువకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్ క్రమబద్ధీకరణ కమిషన్ సభ్యులు కాండ్రేగుల వెంకటరమణ, ఎన్‌వైకె ఎఒ పృధ్వీ, శ్రీకాకుళం విజయనగరం ఎన్‌వైకె యువ అధికారి కె.వెంకట్ ఉజ్వల్, ఎన్ఎస్ఎస్ ప్రెసిడెంట్ అవార్డు గ్రహీత ఆర్.లీలాప్రసాద్, అల్లం రాంప్రసాద్, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

చీడికలో వైద్యశిబిరం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని చీడిక గ్రామంలో గొడిచెర్ల పి హెచ్ సి వైద్యులు సుకన్య, శ్రావణి సంధ్య ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పలువురు రోగులను పరీక్షించి, మందులు అందజేశారు. వైద్యులు, వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. వేడి ఆహారం తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, నిల్వ ఉన్న ఆహారం తీసుకోకూడదన్నారు.పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, డ్రై డే పాటించాలని, దోమలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. దోమలు కుట్టకుండా దోమతెరలను ఉపయోగించుకోవాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో, మురుగు కాలువల్లో దోమల నివారణకు స్ప్రేయింగ్ చేయించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అనితను సన్మానిస్తున్న నాయకులు

ఆలయంలో హోం మంత్రి అనిత పూజలు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని గొడిచెర్ల గ్రామంలో శేషలింగేశ్వర స్వామిని వారిని హెూం మంత్రి వంగలపూడి అనిత శనివారం దర్శించుకున్నారు. స్వామి వారి ఆలయంలో అనిత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు వేద మంత్రోచ్చారణలతో ఆశీర్వదించి, స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం టిడిపి నాయకులు, వైస్ ఎంపీపీ వైబోయిన రమణ ఆధ్వర్యంలో హెూం మంత్రి అనితను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, జనసేన నాయకులు గెడ్డం బుజ్జి, కొప్పిశెట్టి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సిఐఐ సదస్సులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో: విశాఖలోని రుషికొండ గీతం ఇంజినీరింగ్ కాలేజీలో ఈ నెల 6వ తేదీన ప్రారంభమైన కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సిఐఐ) ఎంఎస్ఎంఇ సదస్సులు రెండు రోజుల పాటు జరిగి 7న శనివారం ముగిశాయి. ప్రభుత్వ రంగ సంస్థలు, పెద్ద పరిశ్రమలు ఉంటేనే ఎంఎస్ఎంఇలకు భవిష్యత్తు ఉంటుందని ఈ సదస్సులో వివిధ పత్రాలను సిఐఐ ప్రతినిధులు, ముఖ్య అతిథుల సమక్షంలో సమర్పించారు. బ్యాంకుల నుంచి ఎంఎస్ఎంఇలకు రుణం రావాలంటే సివిల్ స్కోర్ నిబంధన సరికాదని శేష అనే ఎంఎస్ఎంఇ ఎంటర్‌ప్రూనర్ అభ్యంతరం తెలిపారు. వందల కోట్ల ఆస్తి ఉన్నా ఒక్కోసారి సదరు ఔత్సాహిక వేత్తకు బ్యాంకు రుణం విషయంలో సివిల్ స్కోర్ తగ్గి నిరాశ తప్పడం లేదని అభిప్రాయం తెలిపారు. సివిల్ స్కోర్ లేకపోతే అనర్హత వేటు వేసే పద్ధతి మారాలని కోరారు. దీనిపై కేంద్రంతో మాట్లాడాల్సి ఉందని సిఐఐ ప్రతినిధులు తెలిపారు.

ఆకర్షించిన అనకాపల్లి బెల్లం రుచులు

మన ఊరు మన బెల్లం మన ఆరోగ్యం పేరుతో గీతం కాలేజీలో జరిగిన సిఐఐ వెండార్స్ సదస్సులో అనకాపల్లి బెల్లం రుచులు పారిశ్రామిక ఔత్సాహిక వేత్తలను నోరూరించాయి. అనకాపల్లి పట్టణానికి చెందిన ప్రముఖ ఇంటర్నేషనల్ ఆగ్రో ఫుడ్స్ ఆధ్వర్యాన ఎస్.సుజాత శ్రీనివాస్ ఏర్పాటుచేసిన స్టాల్ వద్ద పారిశ్రామిక ఔత్సహికులు శుక్ర, శని వారాల్లో సందడి చేశారు.

అనకాపల్లి బెల్లం రుచులను ఆస్వాదిస్తున్న పారిశ్రామిక వేత్తలు

విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం పరిధి 39వ వార్డులోని క్వీన్ మేరీ హైస్కూల్, ఎంవిడిఎం స్కూల్, 31వ వార్డులోని రమాదేవి బానోజి స్కూల్, 32వ వార్డులోని రైల్వే స్కూల్, 34వ వార్డులోని అచ్చియ్యమ్మ పేట స్కూల్, 41వ వార్డులోని జ్ఞానాపురం స్కూల్లో తల్లిదండ్రుల- ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు.

డివైడర్‌ను ఢీ కొన్న కారు

అదుపు తప్పిన కారు

-తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి- నక్కపల్లి: నక్కపల్లి జాతీయ రహదారి శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గుంటూరు నుంచి విశాఖపట్నం కారులో స్నేహితులు వస్తున్నారు. నక్కపల్లి వద్దకు వచ్చేసరికి ముందు వెళ్తున్న లారీని తప్పించుకోయే క్రమంలో కారు అదుపుతప్పి మరలా వెనక్కి తిరిగి లారీకి స్వల్పంగా ఢీ కొంది. కారులో ప్రయాణిస్తున్న స్నేహితులు ఎటువంటి ప్రమాదం జరగకుండా బయటపడ్డారు. కారు ముందు స్వల్పంగా దెబ్బతింది. రోడ్డు మధ్యలో ఉన్న గ్రిల్స్ దెబ్బ తిన్నాయి. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు.

సిపిఎం మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్: ఈనెల 20,21,22 తేదీ ల్లో నర్సీపట్నంలో జరగనున్న సిపిఎం అనకాపల్లి జిల్లా 24 వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి.వెంకన్న, నాయకులు ఎ.రాజు, గంటా శ్రీరాం పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో వీలేకర్లతో మాట్లాడారు. మూడు సంవత్సరాలకు ఒక్కసారి జరిగే ఈ మహాసభలను జయప్రదానికి ప్రజల సహాయ సహకారాలు అందించాలని కోరారు. జీడి పంటలకు మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా కోనుగోలు చేయాలన్నారు. నాన్ షెడ్యూల్డ్ గిరిజన గ్రామాలను ఐదవ షెడ్యూల్డ్ చేర్చాలని, ఉపాధి చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. పారి శ్రామిక ప్రాంతంలోని పరిశ్రమలో ప్రమాదాలు అరిక ట్టాలని, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలిపారు.పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న వెంకన్న

దాన్యం కోనుగోలు కేంద్రాలు విస్తారంగా పెట్టి మద్దతు ధర ఇచ్చి కోనుగోలు చేయాలన్నారు.నర్సీపట్నంలో డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలన్నారు. జిల్లాలోని భూ కుంభకోణాలపై ధర్యాప్తు చేయాలన్నారు. దళితులపై దాడులు అరికట్టాలన్నారు.మహాసభల జయప్రదానికి జిల్లాలోని యావత్తు ప్రజానీకం అన్నిరకాలుగా సహాయ సహకారాలు అందించాలని వారుకోరారు.

శుద్ధమైన మంచినీరు సరఫరా చేయాలి

: సిపిఎం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నగర ప్రజలకు శుద్ధమైన మంచినీరు సరఫరా చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు, పెన్షనర్ల సంఘం నాయకులు పివిఎస్ఎస్ఎస్ఎల్ఎన్ శాస్త్రి కోరారు. ఈ మేరకు జివిఎంసి కమిషనర్‌కు శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శాస్త్రి మాట్లాడుతూ, విశాఖ నగరంలో జివిఎంసి పైపులు ద్వారా ప్రజలకు సరఫరా అవుతున్న తాగునీరు పరిశుభ్రంగా లేకపోవడం, కలుషితమైన నీరు పైపుల ద్వారా పంపిణీ చేయడంతో నగరంలో అనేక ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీరు ప్రాసెస్ చేయకుండా, చాలా ప్రాంతాల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా కలపకుండా పంపిస్తున్నారని,ఆ నీరు తాగి ప్రజలు అనారోగ్యాల పాలు అవుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. నగరంలో ఇటీవల డయోరియా ప్రబలిన విషయాన్ని గుర్తుచేశారు. జివిఎంసి సరఫరా చేస్తున్న నీటిలో తరచుగా బురద, నలకలు, మట్టి నీరు వస్తోందన్నారు. తక్షణం నగరంలోని నీటి సరఫరా ట్యాంకులన్నీ లిస్టు ప్రకారం శుభ్రం చేయించాలని, నగరంలో అన్ని కాలనీలలో కనీసం జోన్‌కు రెండు నీటి శుద్ధి పరీక్షా కేంద్రాలు నెలకొల్పాలని, సాంకేతిక కారణాల వల్ల నీటి సరఫరా ఆగిపోతే ప్రజలకు సమాచారం ఇవ్వాలని శాస్త్రి కోరారు.